



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 146 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 7 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 146 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 7 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## తమిళనాడులో 9 మంది పోలీసులకు

# మరణ శిక్ష ఖరారు

### మధురై కోర్టు సంచలన తీర్పు

- సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు
- తొమ్మిది మంది పోలీసు అధికారులకు మరణ శిక్ష ఖరారు
- ఇది అత్యంత అరుదైన కేసు అని అభివర్ణించిన కోర్టు
- బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం
- 2020లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన ఇది








మిగతా 2లో



# అధికారం అంటే గొప్ప బాధ్యత

- పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నామన్న భట్టి
- అధికారం అంటే హోదా కాదన్న డిప్యూటీ సీఎం
- 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడి

మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా పిప్రి బహిరంగ సభలో మాట్లాడుతూ, 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నామని, తమకు అధికారం అంటే హోదా కాదు,



## కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

### అమెరికా, ఇజ్రాయెల్‌కు సవాల్!

- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ కొత్త డ్రోన్
- 'హదీద్-110' పేరుతో స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్ తయారీ
- షాహెద్ కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణం
- గంటకు 510 కి.మీ వేగంతో 350 కి.మీ పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధంలో కొత్త దశకు సంకేతం

మిగతా 2లో



## ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

### ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

- అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న దాడుల్లో పలువురు ఉన్నతాధికారుల మరణం
- దాడిని ధృవీకరించిన ఇరాన్ ప్రభుత్వం, ఐఆర్‌జీసీ
- ఈ ఘటనతో మరింత పెరగనున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు

మిగతా 2లో

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

### శ్రీవారి అన్నదానంపై సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్టు

- తిరుమల నిత్యాన్నదాన పథకానికి 39 వసంతాలు పూర్తి
- 2 వేల మందితో మొదలై నేడు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం
- రూ.2,500 కోట్లు దాటిన శ్రీవారి అన్నప్రసాదం ట్రస్ట్ నిధులు
- దాతల సహకారం మరువలేనిదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీటీడీ పరిధిలోని 60 ఆలయాలకు పథకం విస్తరణ

మిగతా 2లో




## తులం బంగారం హామీని త్వరలోనే నెరవేరుస్తాం

- తులం బంగారం హామీపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు
- ఇప్పటికే మెజారిటీ హామీలను అమలు చేశామని వెల్లడి
- సీఎం, మంత్రుల మధ్య విభేదాల ఉన్నాయనే ప్రచారాన్ని కొట్టిపారేసిన వైనం

మిగతా 2లో




## బంజారా నేతలతో కల్వకుంట్ల కవిత భేటీ..

### తన పార్టీకి అండగా ఉండాలని విన్నపం

- రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత
- ఆయనతో పాటు పలువురు బంజారా నేతలతో భేటీ
- మంత్రివర్గంలో బంజారాలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆవేదన

మిగతా 2లో






## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

### ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

- ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ తీరుకు ఇప్పటికే దేశం పలుమార్లు మూల్యం చెల్లించుకుంటోందన్న మోదీ
- జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన

మిగతా 2లో

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- కేరళలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం
- సీఎం విజయన్ పై నిప్పులు చెరిగిన రాహుల్ గాంధీ
- ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని విమర్శ
- కేరళలో బీజేపీ, లెఫ్ట్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ
- మోదీని విమర్శిస్తే తనపై కేసులు, విజయన్‌పై ఎందుకు లేవని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విజయన్ ఏమీ దైవాంశ సంభూతుడు కాదని, ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని అన్నారు. త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన రాహుల్.. కేరళలో బీజేపీ, వామపక్షాల (ఎల్డీఎఫ్) మధ్య రహస్య అవగాహన ఉందని సంచలన ఆరోపణలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని

మిగతా 2లో

## సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



- కోహెడ పండ్ల మార్కెట్ భూములపై సీఎం కన్నుపడిందని ఆరోపణ
- భూములు కనిపిస్తే అమ్మివేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం
- ప్రభుత్వం రైతుల కోసం పనిచేయాలి తప్ప దళారుల కోసం కాదని విమర్శ

మిగతా 2లో



# త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం

- ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామన్న రేవంత్
- ఆదిలాబాద్ జిల్లాలో అతిపెద్ద పారిశ్రామికవాడను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడి
- జిల్లాలో త్వరలో యూనివర్శిటీ నిర్మిస్తామన్న సీఎం

హైదరాబాద్ పెన్ పవర్:ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పేరుతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పిప్రి నుంచే మొదలయిందని... ఇక్కడి ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పిప్రిలో నిర్వహించిన బహిరంగ సభలో

మిగతా 2లో






# రాళ్ళకు జీవం పోసిన అసమాన శిల్పి గణపతి స్థపతి

శిలలపై శిల్పాలు చెక్కి నారు..మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారు...1962లో విడుదలైన మంచి మనసులు చిత్రంలో, ఆచార్య ఆత్రేయ సాహిత్యం అందించిందిన, పాటకి కె.వి.మహదేవన్ అద్భుతమైన సంగీతం అందించిన, అమర గాయకుడు ఘంటసాల పాడిన పాట గుర్తుకు రాగానే విజయనగర సామ్రాజ్య శిల్పకళకు నెలవైన హంపిలో చిత్రీకరించిన చిత్రాలు కళ్లముందు సజీవంగా సాక్షాత్కా రిస్తాయి. అలాగే అమర శిల్పి జక్కన్న కళ్ళముందు కదలడం అత్యంత సహజం. ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళ కు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్పురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళు మూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు.గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 – 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి.శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది.దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది.నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది.1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాధ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు.దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు.రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978--89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు.ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి.

వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శు భాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాకిస్థాన్ సోషల్ మీడియా సమాచారం ఆధారంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ భారత ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపించారు.అసోంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాకిస్థాన్ పాటనే పాడిందని మండిపడ్డారు. ఈ సంబంధం ఎప్పటి నుంచో సాగుతోందని అన్నారు. జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇటీవల రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వారు పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్లు గుర్తించామని ఆరోపించారు. నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ ఢిల్లీలో, గౌహతిలో రెండు మీడియా సమావేశాలు నిర్వహించారని తెలిపారు.

ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా వారు మాట్లాడిన సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి తీసుకున్నదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలో ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలు నిర్వహించిందని, ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఈ ప్రతి టాక్ షోలోనూ కాంగ్రెస్ గెలవాలని పాకిస్థాన్ మీడియా కోరుకుందని వెల్లడించారు.

**కాంగ్రెస్ ఆరోపణలపై ముఖ్యమంత్రి ఆగ్రహం**

హిమంత బిశ్వశర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీనితో పాటు ఆమె ఆస్తులను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల సమయంలో కావాలని ఇలాంటి ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇందుకు కాంగ్రెస్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలకు గాను తన భార్య కేసు పెట్టినట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

# తమిళనాడులో 9 మంది పోలీసులకు మరణ శిక్ష ఖరారు

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్–19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

## బంజారా నేతలతో కల్వకుంట్ల కవిత భేటీ..

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపుతూ, ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అన్ని వర్గాల మద్దతు కూడగట్టే పనిలో భాగంగా, ఈరోజు ఆమె హైదరాబాద్‌లో బంజారా సామాజిక వర్గ ప్రముఖులతో భేటీ అయ్యారు.రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత... ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తన కొత్త రాజకీయ ప్రయాణానికి మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆమె వారిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మంత్రివర్గంలో బంజారాలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయమని ఆమె పేర్కొన్నారు.తమ పార్టీలో బంజారాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు కోరుతున్నామని కవిత అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనుకునే బంజారా యువతను, నేతలను తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కవిత పిలుపునిచ్చారు.

## అధికారం అంటే గొప్ప బాధ్యత

- మొదటి పేజి తరువాయి

బాధ్యత అని ఆయన అన్నారు. కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లను రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ. 5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని తీసుకువచ్చామని, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వేగంగా సాగుతోందని చెప్పారు. సామాజిక అంతరాలు లేని సమాజం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని తెలిపారు. ఆదాయాన్ని సృష్టించి, ఆ సంపదను ప్రజలకే పంచడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నాడు పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నూటికి నూరు శాతం అమలు చేస్తామని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రజలకు భరోసా ఇచ్చారు.

## త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం

- మొదటి పేజి తరువాయి

ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయన వరాల జల్లు కురిపించారు.

గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలను నిర్బంధించే సంస్కృతి ఉండేదని, కానీ తమ 'ప్రజాపాలన'లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా, తమ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం రాబోతోందని, వీలైతే జూన్ 2వ తేదీన దీనికి శిలాఫలకం వేస్తామని ప్రకటించారు. వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీని నిర్మిస్తామని, అలాగే బాసర క్షేత్రాన్ని దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 మార్చి వరకు జిల్లాల సరిహద్దు మార్పులకు అవకాశం లేదని, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్ వేసి బోథ్ రెవెన్యూ డివిజన్ వంటి డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారులోని కోహెడ పండ్ల మార్కెట్ భూములపై ముఖ్యమంత్రి కన్నుపడిందని ఆరోపించారు. ఎక్కడైనా భూములు కనిపిస్తే చాలు వాటిని అమ్మివేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని కోహెడ పండ్ల మార్కెట్ స్థలాన్ని సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వాలు రైతుల కోసం పనిచేయాలి తప్ప దళారుల కోసం కాదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మార్కెట్ భూసేకరణలో భాగంగా రూ.10 కోట్లు రైతులకు ఇప్పించామని, కోహెడలో ప్రపంచ అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ కట్టాలని భావించామని తెలిపారు. వెయ్యి కోట్ల రూపాయలతో డీపీఆర్ తయారు చేశామని, వందేళ్లను దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు.

## తులం బంగారం హామీని త్వరలోనే నెరవేరుస్తాం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై రాజకీయ దుమారం కొనసాగుతున్నవేళ... రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఒక యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఇప్పటికే మెజారిటీ హామీలను అమలు చేశామని, మిగిలినవన్నీ ఈ ఐదేళ్ల పదవీ కాలంలోనే నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా తులం బంగారం హామీని కూడా త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ పార్టీ కావాలనే '420 హామీలు' అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని, వారి జిమ్మిక్కులను ప్రజలు నమ్మరని మంత్రి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ప్రాక్టికల్‌గా ఉంటూ ఆచరణాత్మక పథకాలను రూపొందిస్తోందని, కొద్దిగా ఆలస్యమైనా ప్రతి మాటనూ నిలబెట్టుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. సీఎం ఒక కెప్టెన్‌లా

అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని, కేబినెట్ అంతా ఐక్యంగా ఉందని క్లారిటీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

## ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు.ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించింది.

## కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ ఓ సరికొత్త స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్‌ను బయటికి తీసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్‌కు 'హదీద్–110' అని పేరు పెట్టారు. ఇది ఇప్పటికే యుద్ధరంగంలో వినియోగంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి రాడార్లకు చిక్కకుండా, వేగంగా దూసుకెళ్లి లక్ష్యాలను ధ్వంసం చేసేలా దీన్ని రూపొందించినట్లు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోలో వెల్లడించింది.ఈ కొత్త డ్రోన్ ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది సూసైడ్ డ్రోన్ తరహాలో పనిచేస్తుంది. అంటే, లక్ష్యాన్ని చేరుకుని, తనను తాను పేల్చుకుని విధ్వంసం సృష్టిస్తుంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు, కమాండ్ సెంటర్లు, కీలకమైన మౌలిక సదుపాయాలే దీని ప్రధాన లక్ష్యాలు. ఇరాన్ ఇప్పటివరకు వినియోగిస్తున్న షాహెద్–136 డ్రోన్‌తో పోలిస్తే, హదీద్–110 దాదాపు మూడు రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. ఇది గంటకు సుమారు 510 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.హదీద్–110 డ్రోన్‌లో 30 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను (హై ఎక్స్‌ప్లోసివ్ వార్‌హెడ్) అమర్చవచ్చు. దీని పరిధి సుమారు 350 కిలోమీటర్లు కాగా, దాదాపు గంటపాటు గాలిలో ఎగరగలదు. కాంపాక్ట్ జెట్ ఇంజిన్‌తో పనిచేసే ఈ డ్రోన్, డెల్టా–వింగ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఈ ప్రత్యేక ఆకృతి వల్లే రాడార్ సిగ్నల్స్‌కు సులభంగా చిక్కకుండా (తక్కువ రాడార్ క్రాస్–సెక్షన్) స్టెల్త్ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. దీన్ని నేరుగా కాటపల్ట్ ద్వారా గాల్లోకి ప్రయోగించి, ఆ తర్వాత జెట్ ఇంజిన్‌ను స్టార్ట్ చేసి ముందుకు పంపిస్తారు.ఇప్పటికే ఈ డ్రోన్‌ను ఉపయోగించి అమెరికా సైనిక స్థావరాలు లేదా సంబంధిత లక్ష్యాలపై తొలి దాడులు జరిగాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. షాహెద్ వంటి నెమ్మదైన డ్రోన్లను ఎదుర్కోవడానికి అలవాటుపడిన అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల రక్షణ వ్యవస్థలకు ఈ వేగవంతమైన స్టెల్త్ డ్రోన్ కొత్త సవాలుగా మారింది. హదీద్–110 రాకతో మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధ తంత్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇది ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- మొదటి పేజి తరువాయి

విమర్శించినందుకు తనపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకున్నాయని, కానీ సీఎం విజయన్‌ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ ఎందుకు ప్రశ్నించడం లేదని రాహుల్ నిలదీశారు. ఈ పరిణామం బీజేపీ, లెఫ్ట్ నేతల మధ్య ఉన్న రాజకీయ ఒప్పందాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. కేరళ పర్యటనల్లో ప్రధాని మోదీ మతపరమైన అంశాలు మాట్లాడతారని, కానీ శబరిమల స్మగ్లింగ్ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. వామపక్షాలకు సహాయం చేసేందుకే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా కేవలం విజయన్ ఫొటోలతో ఉన్న పోస్టర్లను ప్రస్తావిస్తూ, పాలన అంతా ఒక్కరే చేస్తున్నారనే అభిప్రాయాన్ని కల్పించడం రాజకీయ అహంకారమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ తరహా ఏకవ్యక్తి నాయకత్వం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మల పాలనలో కనిపిస్తుందని అన్నారు.కేరళలో పాలన సాగించేందుకు విజయన్ ఒక్కరే సమర్థుడని ప్రచారం చేసుకోవడం ప్రజలను అవమానించడమేనని రాహుల్ అన్నారు. వినయం, ప్రజల సానుభూతి ఉన్న ఎందరో నాయకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజాస్వామ్య నాయకత్వానికి అణకువ అవసరమని హితవు పలికారు. కేరళలో అసలైన పోరాటం యూడీఎఫ్‌కు, బీజేపీ–ఎల్‌డీఎఫ్ కూటమికి మధ్యేనని ఆయన స్పష్టం చేశారు.

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకం మరో మైలురాయిని అధిగమించింది. 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన ఈ మహోన్నత కార్యక్రమం నేటితో 39 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం కేవలం 2 వేల మంది భక్తులతో మొదలైన ఈ సేవ, నేడు రోజుకు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం అందించే స్థాయికి చేరడం విశేషం.ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల భాగస్వామ్యం, దాతల సహకారంతో శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ మూల నిధి రూ.2,500 కోట్లు దాటిందని తెలిపారు. ఈ పథకం స్ఫూర్తితోనే ప్రాణదానం, విద్యాదానం వంటి ట్రస్టులను ఏర్పాటు చేసి టీటీడీ ద్వారా వైద్య, విద్యా రంగాల్లో సేవలు అందిస్తున్నామని వివరించారు.ప్రస్తుతం టీటీడీ పరిధిలోని మరో 60 దేవాలయాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ నిత్యాన్నదానం

పథకాన్ని అమలు చేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిని వివరిస్తూ చంద్రబాబు సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను కూడా పంచుకున్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి చేయూతనిస్తున్న దాతలకు ఆయన అభినందనలు, నమస్కారాలు తెలియజేశారు.


మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్).

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల 2 బిహెచ్‌కే సముదాయాల్లో నిర్మించిన వాణిజ్య దుకాణాలను విక్రయించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో బహిరంగ వేలం ప్రక్రియను ప్రారంభించింది.. ఈ వేలం ద్వారా సమకూరే నిధులను ప్రత్యేక కార్పస్ ఫండ్‌గా మార్చి, కాలనీల్లో మురుగు వ్యవస్థ, వీధి దీపాలు, పార్కులు, రహదారుల అభివృద్ధికి వినియోగించనున్నట్టు అధికారులు వెల్లడించారు..
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 6:

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# డబుల్ బెడ్‌రూం సముదాయాల్లో...
# వాణిజ్య దుకాణాల వేలం

- ఈనెల 15-17న బహిరంగ వేలానికి అడిషనల్ కలెక్టర్ ప్రకటన జారీ..
- దుండిగల్ 273 దుకాణాలు వాటి విస్తీర్ణం 174.17 చ. నుంచి 329.41 చ. అడుగులు.
- బాచుపల్లి 79 దుకాణాలు-నిజాంపేట్ 120 దుకాణాలకు వేలంపాట..
- వేలంపాట నిధులను భవిష్యత్ మౌలిక సదుపాయాలకు వినియోగం..
- జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో వాణిజ్య దుకాణాలకు వేలంపాట..
- చదరపు అడుగుకు రూ.2000 నుంచి రూ.3920 వరకు ధరల నిర్ణయం..
- చైతన్య నగర్ నుంచి బాచుపల్లి వరకు పలు ప్రాంతాలు 2 బిహెచ్‌కె కవర్..
- రూ.35,000 డిమాండ్ డ్రాఫ్ట్‌తో వేలంలో పాల్గొనే అవకాశం..

### జిల్లా కలెక్టర్, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాలు..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో, మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిర్మించిన వాణిజ్య దుఖాణాలకు వివిధ ప్రాంతాల వారీగా బహిరంగ వేలంపాట వేయనున్నట్లు కలెక్టర్‌లకు ఉత్తర్వులు జారీ చేసింది.. ఈ నేపథ్యంలో సోమవారం ప్రకటన విడుదల చేసింది.. 2బిహెచ్‌కే సముదాయాల వాణిజ్య దుకాణాల బహిరంగ వేలంతో అభివృద్ధి దిశగా భవిష్యత్తు మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో నిర్మించిన వాణిజ్య దుకాణాలను విక్రయించడానికి జిల్లా కలెక్టర్, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 15 - 17వ తేదీలలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్‌బాడీ) శనివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు..

### జిల్లాలో ప్రాంతాల వారీగా 2 బిహెచ్‌కె దుకాణాలు-ధరలు.."

జిల్లాలోని చైతన్య నగర్‌లో 14 దుకాణాలు వాటి విస్తీర్ణం 116.38 చ. అడుగుల నుంచి 185.25 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.2700 ధర నిర్ణయించారు. చెర్లపల్లిలో 11 దుకాణాలు వాటి విస్తీర్ణం 74.97 చ. అడుగుల నుంచి 399.52 చ. అడుగుల వరకు ఉంటుంది.. ప్రతి అడుగు రూ.3200 గా ధర నిర్ణయించారు.. శ్రీరామ్ నగర్‌లో 30 దుకాణాలు వాటి విస్తీర్ణం 71.40 చ. అడుగుల నుంచి 217.10 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.3300 ధర నిర్ణయించారు.. కొర్రెముల 22 దుకాణాలు వాటి విస్తీర్ణం 186.62 చ. అడుగుల నుంచి 241.20 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.2000 నిర్ణయించారు.. రాంపల్లి 80 దుకాణాలు వాటి విస్తీర్ణం 170.09 చ. అడుగుల నుంచి 236.70చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు గ్రౌండ్ ఫ్లోర్‌లో రూ.3000, ఫస్ట్ ఫ్లోర్‌లో రూ.2500 ధర నిర్ నిర్ణయించారు.. తూంకుంట 41 దుకాణాలు వాటి విస్తీర్ణం 171.60 చ. అడుగుల నుంచి 233.13 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.3920 ధరను నిర్ణయించారు.. మురహరిపల్లిలో 47 దుకాణాలు వాటి విస్తీర్ణం 162.24 చ. అడుగుల నుంచి 218.18 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.2450 ధర నిర్ణయించారు. అహ్మెద్ గూడలో 156 దుకాణాలు వాటి విస్తీర్ణం 45.63 చ. అడుగుల నుంచి 179.13 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.2380 ధర నిర్ణయించారు.. కైసర్ నగర్ 19 దుకాణాలు వాటి విస్తీర్ణం 59.05 చ. అడుగుల నుంచి 222.15 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.3500 నిర్ణయించారు.. దుండిగల్‌లో మొత్తం 273 దుకాణాలు వాటి విస్తీర్ణం 174.17 చ. అడుగుల నుంచి 329.41 చ. అడుగుల వరకు ఉంటుంది.. ప్రతి అడుగు రూ.2800 ధర నిర్ణయించారు.. బాచుపల్లిలో 79 వాణిజ్య దుకాణాలు వాటి విస్తీర్ణం 60.26 చ. అడుగుల నుంచి 240.27 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.3900 ధర నిర్ణయించారు.. నిజాంపేట్ 120 దుకాణాలు వాటి విస్తీర్ణం 60.85 చ. అడుగుల నుంచి 239.68 చ. అడుగుల వరకు ఉంటుంది. ప్రతి అడుగు రూ.3900 నిర్ణయించారు.

ఈ ఎండి మొత్తం రూ.35,000 ఏదైనా జాతీయ బ్యాంక్ నుంచి జిల్లా కలెక్టర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ (డి.డి) తీసి వేలంలో పాల్గొనాలని సూచించారు. వచ్చే మొత్తాన్ని పత్యేక నిధి (కార్పస్ ఫండ్) క్రింద జమ చేస్తారు. దీనిపై వచ్చే వడ్డీ సొమ్మును కాలనీల్లో మురుగు వ్యవస్థ, వీధి దీపాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారుల మరమ్మత్తులకు వెచ్చిస్తారు. పూర్తి వివరాలకు డి.ఈ.ఈ. హౌసింగ్, నెం.8712032821, పి.డి హౌసింగ్, నెం.8712032718, ఆర్.డి.వో కీసర నెం.7995073744, ఏ.ఓ. నెంబర్ 7995073745, ఆర్.డి.వో మల్కాజిగిరి నెంబర్:7995073753, ఏ.ఓ నెంబర్: 9849902699, ఈ ఫోన్ నెంబర్ లకు సంప్రదించాలని కోరారు..


తెలంగాణ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం..

## బండి సంజయ్ పై వేముల వీరేశం తీవ్ర విమర్శలు

- నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రాష్ట్రానికి జరిగే అన్యాయంపై రేవంత్ మాట్లాడుతున్నారన్న వేముల
- సీఎంపై బండి సంజయ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపాటు
- తెలంగాణకు న్యాయం జరిగేలా బండి సంజయ్ పని చేయాలని హితవు

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కూల్చివేతలు..

**గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ రోడ్డులో 80 ఆక్రమణల తొలగింపు..**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 పరిధిలో చర్యలు..
టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం..
ఫుట్‌పాత్‌ల కబ్జాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి జీహెచ్ఎంసి వ్యాప్తంగా చర్యలు..



-4 లో

## బాసర ఆలయంలో మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సీఎం రేవంత్ రెడ్డి

- బాసరలో పర్యటించి, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం
- కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- సీఎం మనవడికి అక్షరాభ్యాసం చేయించిన ఆలయ ప్రధాన అర్చకుడు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో తన మనవడు రియాన్ష్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్యమంత్రి ఈరోజు బాసరలో పర్యటించి ఆలయ అభివృద్ధి పనులకోసం భూమిపూజ చేశారు. కుటుంబంతో సహా ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మహారాజ్... రియాన్ష్ కు పలక బలపంతో అక్షరాభ్యాసం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిశా రెడ్డి దంపతులతో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, తన మనవడికి తల్లిదండ్రులు రియాన్ష్ అని పేరు పెట్టగా, తాను మాత్రం రుద్రదేవ్ అని పిలుచుకుంటానని ఒక సందర్భంలో ముఖ్యమంత్రి చెప్పారు.



# ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కూల్చివేతలు

## గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ రోడ్డులో 80 ఆక్రమణల తొలగింపు..

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 పరిధిలో చర్యలు..
- టౌన్‌ప్లానింగ్ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం..
- ఫుట్‌పాత్‌ల కబ్జాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి జీహెచ్‌ఎంసి వ్యాప్తంగా చర్యలు..




**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 6:** గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ రోడ్‌లో దుండిగల్ సర్కిల్ పరిధి వరకు సోమవారం టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించారు.. రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన అక్రమ దుకాణాలు, షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించి సుమారు 80 నిర్మాణాలను తొలగించింది.. ఈ కూల్చివేతలు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొని జేసిబితో కూల్చివేతలు చేపట్టారు.. నగరంలో రోడ్డు ఆక్రమణల తొలగింపులో నెలకొంటున్న కొన్ని సంఘటనల దృష్ట్యా, దుండిగల్ సర్కిల్ అధికారులు ముందస్తుగా పోలీసు బలగాల సహకారంతో చర్యలకు రంగంలోకి దిగారు.. సోమవారం ఉదయం నుంచే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటైన ఆక్రమణలను గుర్తించి దశలవారీ తొలగింపుకు శ్రీకారం చుట్టారు..



దుండిగల్ సర్కిల్ కమాన్ వద్ద రోడ్డు ఆక్రమణ కూల్చిన తర్వాత..

### చర్యలు నిరంతరం కొనసాగుతాయి..

దుండిగల్ సర్కిల్ అధికారులు ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతాయని అన్నారు.. ఫుట్‌పాత్‌లు రహదారులపై ఆక్రమణలను ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల సౌలభ్యం కోసం ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉండాలని, మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ కూల్చివేతలతో రహదారి విస్తరణకు మార్గం సుగమం అవుతుందని, ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పాదచారుల భద్రత, నగర శ్రేయస్సు దృష్ట్యా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు..



### పాదచారులకు ఇబ్బందులు.. ట్రాఫిక్‌పై ప్రభావం..

గత కొంతకాలంగా ఈ మార్గంలో ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమించటంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గండిమైసమ్మ చౌరస్తా పరిసరాల్లో అనధికార దుకాణాలు పెరగడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.. దీంతో ముందస్తుగా నోటీసులు జారీచేసినా, వీధి వ్యాపారులు నిర్లక్ష్యం వహించారని, సువిశాలమైన రోడ్లతో నగర విస్తరణలో భాగంగా సోమవారం ఈ ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేతలు ప్రారంభించారు..

### స్వచ్ఛందంగా తొలగింపుకు విజ్ఞప్తి..

దుండిగల్ సర్కిల్ అధికారులు, పోలీసులు వీధి వ్యాపారులకి విజ్ఞప్తి చేశారు.. ఎవరికి వారే స్వచ్ఛందంగా రోడ్డు- ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించుకుంటే సామాగ్రి నష్టం వాటిల్లకుండా ఉంటుందని, అధికారులు జేసిబితో కూల్చివేతలు చేపడితే కష్టపడి సంపాదించిన పలురకాల వస్తువులు ధ్వంసం అవుతాయని అధికారులు తెలిపారు.. ఆక్రమణదారులకు ముందుగానే నోటీసులు జారీ చేసి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో, నిబంధనల ప్రకారం యంత్రాంగం రంగంలోకి దిగి కూల్చివేతలు చేపట్టింది. ఈ చర్యల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు..



రోడ్డు ఆక్రమణల తొలగింపు అనంతరం సామాగ్రిని తీసుకుంటున్న వీధి వ్యాపారులు..

# బండి సంజయ్ పై వేముల వీరేశం తీవ్ర విమర్శలు


**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర మంత్రి బండి సంజయ్ పై తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటాన్ని సమర్థిస్తూ, బీజేపీ వైఖరిని ఆయన తప్పుబట్టారు.నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ప్రజల తరఫున సీఎం మాట్లాడుతుంటే, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఆ నష్టాన్ని అడ్డుకుంటామని చెప్పాల్సింది పోయి, సీఎంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశభక్తి కేవలం తనకే ఉన్నట్లు బండి సంజయ్ మాట్లాడుతున్నారని... కానీ, దేశం కోసం రక్తాన్ని ధారపోసిన చరిత్ర గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీదని ఆయన గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న వాస్తవాలకు బీజేపీ నాయకులు భయపడుతున్నారని, అందుకే అవాకులు చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలని, పని చేయడం చేతకాకపోతే సీఎంతో కలిసి పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రిపై అనవసర విమర్శలు మానుకోవాలని, వాస్తవాలను గ్రహించి రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలని హితవు పలికారు.

# దళారుల దందా కోసం కోహెడ ఫ్రూట్ మార్కెట్ భూములను అమ్మేస్తారా?

**రైతులకు ఉపయోగపడే 200 ఎకరాల కోహెడ మార్కెట్ భూమిపై రేవంత్ రెడ్డి కన్ను. హరీష్ రావు**

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కోహెడ పండ్ల మార్కెట్ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హరీష్ రావు తోపాటు పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ తదితర నాయకులు పాల్గొనారు.మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ఈరోజు ఇక్కడికి రాజకీయాల కోసం రాలేదు రైతుల కోసం వచ్చాను. ఈ సమస్య బీఆర్ఎస్ పార్టీదో కాంగ్రెస్ పార్టీదో కాదు రైతుల సమస్య ఇది ఏ ప్రభుత్వమైనా రైతుల కోసం పనిచేయాలని దళారుల కోసం కాదని అన్నారు.నేను ఈ వేదిక నుండి సీఎం రేవంత్ రెడ్డిని, వ్యవసాయ శాఖ మంత్రికి కోరుతున్నా.. లక్షలాది మంది రైతుల కోసం ఆలోచించండి తప్ప నలుగురు ఐదుగురు దళారుల కోసం కాదని అన్నారు. గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్లో ట్రాఫిక్ తగ్గించడానికి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇక్కడ 200 ఎకరాల్లో ఈ మార్కెట్ ను నిర్మించాలని ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నపుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాతో కొట్లాడి రూ.10 కోట్లను ఫ్రూట్ మార్కెట్ కోసం చేసిన భూసేకరణలో భాగంగా ఇక్కడ రైతులకి ఇప్పించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ కట్టాలనుకున్నాం. 2020 సంవత్సరంలో జీవో 11 ద్వారా ఈ మార్కెట్ ను నోటిఫై చేశాం. జీవో 216 ప్రకారం రూ.350 కోట్ల డబ్బులను మార్కెట్ కోసం బ్యాంక్ అకౌంట్లో ఉంచాము..ఎలా కట్టాలని ప్లాన్ కూడా చేసామన్నారు. రూ.1,000 కోట్లతో డీపీఆర్ తయారు చేసాం, ఫ్యూచర్ లో ఇక్కడే ఫ్లవర్ మార్కెట్ రావాలి, ఫిష్ మార్కెట్ రావాలని తీర్చిదిద్దాం. 100 ఏండ్లను దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కు రూపకల్పన చేశాం. డబ్బులు రెడీ, భూమి రెడీ అంతా రెడీగా ఉంది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పని ముందుకు తీసుకపోగా ఈ భూమిని అమ్మాలని చూస్తున్నది. ఈ భూమి దాదాపు 3 వేల కోట్ల విలువ ఉంది. ఈ భూమిని ౧+××జ కి ఇచ్చి తమ వాళ్లకు కట్టబెట్టాలని చూస్తున్నది.

రోజు 25 30 వేల రైతులకు ఉపయోగపడే వారి భవిష్యత్తు ముఖ్యమా ? నలుగురు ఐదుగురు వ్యాపారులు, దళారులు ముఖ్యమా ? రైతులు ముఖ్యమా ? వ్యాపారులు ముఖ్యమా? ఇక్కడ భూములకు ప్రత్యామ్నాయంగా దిల్ భూముల్లో మార్కెట్ కట్టిస్తాం అంటున్నారు. ఆ దిల్ భూముల జోలికి వెళ్లొద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్వాల్వ్ ఉంది. ఎస్సీ రైతులు పంట పండిస్తున్నారు. అలాంటి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తామంటే ఎలా నమ్మాలి ? రేవంత్ రెడ్డికి భూముల మీద కన్ను పడిందని అన్నారు.




## సంజయ్‌కుమార్ ఫిరాయింపుతో..


**కరీంనగర్, ఏప్రిల్ 6, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ఇటీవలే స్వస్తి పలికిన రాజకీయ కృరవృద్ధుడు
ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనే రీతిలో రాజకీయం సాగింది. కానీ గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు,అవమానాలు ఆయనను తీవ్రంగా కలిచివేశాయి. దీంతో పార్టీకి గుడ్‌బైయ్ చెప్పాడు.బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలవగా, సంజయ్‌కుమార్ గెలిచారు. అనూహ్యంగాసంజయ్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్‌రెడ్డికి మింగుడుపడలేదు. దీంతో కీలక నిర్ణయం తీసుకుని, గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంతకాలంతిట్టిన గులాబీ పార్టీ నేతలతోనే త్వరలో పొగిడించుకోబోతున్నారు.జీవన్‌రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జగిత్యాలసమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించే యోచనలో అధిష్టానం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటనవెలువడే అవకాశం ఉంది. ప్లీనరీ సభ వేదిక మీదుగానే కేసీఆర్ జీవన్‌రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించనున్నారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్న నేపథ్యంలో బలమైన సంకేతాలను పంపించేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు.జీవన్‌రెడ్డి చేరికతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన నేతను కోల్పోయినట్లైంది. బీఆర్ఎస్‌కు మాత్రం బలం చేకూరనుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం పట్ల జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు.జీవన్‌రెడ్డి చేరికతోపాటు, ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వవచ్చని తెలుస్తోంది. కేసీఆర్ హామీతోనే జీవన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జీవన్‌రెడ్డి చేరిక తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతలు కూడా బీఆర్ఎస్‌వైపు చూసే అవకాశం ఉంది.
జగిత్యాల ప్లీనరీ ద్వారా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకోవాలని భావిస్తోంది.42 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి తెరదించి, గులాబీ గూటికి చేరుతున్న జీవన్‌రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపింది. జగిత్యాల వేదికగా జరగనున్న ప్లీనరీ ఈ మార్పుకు సాక్ష్యం నిలవనుంది.

## ఏమౌతోంది... ఐఎఎస్ ఆఫీసర్లు,,,

**కరీంనగర్, ఏప్రిల్ 6, పెన్ పవర్:** భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు సీఎం ఓలో ప్రియాంక వర్గీస్, స్మిత సబర్వాల్ కీలక అధికారులుగా ఉండేవారు. వారితోపాటు జయేష్ రంజన్ కూడా ఉండేవాడు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా.. అప్పట్లో ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించిన అధికారిగా జయేష్ సుపరిచితుడు. నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా.. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడు.భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత కొద్ది రోజులపాటు రంజన్ ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టుబడుల సదస్సు కోసం వెళ్ళినప్పుడు రంజన్ కూడా ఆయన వెంట ఉన్నారు. అయితేనాడు కుదుర్చుకున్న ఎం ఓ యు వ్యవహారాలలో లోపాలు ఉన్నాయని భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఆ ఆరోపణలు తగ్గట్టుగానే ప్రభుత్వ వ్యవహార శైలి ఉండడం ఆందోళన కలిగించింది. చివరికి రంజన్ సెల్ఫీ వీడియో తీసి.. తెలంగాణ ప్రజలకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది.ఈ ఉదంతం రంజన్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగ్రహాన్ని కలిగించిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గ్లోబల్ సమ్మిట్ విఫలం కావడంతో రంజన్ వ్యవహార శైలి పై మరోసారి చర్చ జరిగింది. గ్లోబల్ సమ్మిట్ జరిగేటప్పుడు కీలక సమాచారం భారత రాష్ట్ర సమితి చేతుల్లోకి వెళ్ళింది. దీంతో అప్పుడే ప్రభుత్వం అప్రమత్తమయింది. వెంటనే లోతుగా విచారణకు ఆదేశించింది. దీంతో కొంతమంది అధికారులు కావాలని ప్రభుత్వ సమాచారాన్ని ప్రతిపక్ష పార్టీకి అందిస్తున్నారని అందులో తేలింది. ఇక అప్పటినుంచి జయేష్ మీద ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అతడిని ఐటీ విభాగం నుంచి దూరం చేసింది. ఆ తర్వాత ఇప్పుడు సీఎం ఓ నుంచి కూడా పక్కనపెట్టింది. ఆయనకు క్రీడా శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది.గతంలో జయేష్ కేటీఆర్ కు దగ్గరగా ఉండటంవల్ల.. కీలకమైన విషయాలు ఆయన ద్వారా ప్రతిపక్ష పార్టీకి తెలుస్తున్నాయని ప్రభుత్వానికి సమాచారం ఉండడం వల్ల.. రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జయేష్ కు స్థానచలనం తప్పదని ప్రచారం జరిగింది. అయితే రేవంత్ ప్రభుత్వం కొద్దిరోజులపాటు అతడినే అదే శాఖలో కొనసాగించింది. చివరికి ప్రభుత్వం నుంచి కీలక సమాచారం బయటకు పోతున్న క్రమంలో.. ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి నడుం బిగించారు. తన వేగుల ద్వారాసమాచారం తెప్పించుకుని.. సరైన సమయంలో.. సరైన విధంగా వేటు వేశారు. పైకి క్రీడాభివృద్ధి అని చెబుతున్నప్పటికీ .. అసలు అంతరార్థం వేరే ఉందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తానికి సీఎంఓ నుంచి జయష్ నుపంపించడం ద్వారా పూర్తిగా ప్రక్షాళన చేసామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ వచ్చిన తర్వాత ప్రియాంక, స్మిత.. ఇప్పుడు జయేష్ సీఎం ఓ నుంచి బయటికి వెళ్లిపోయారు. స్మిత అనారోగ్యం వల్ల లాంగ్ లీవ్ లో ఉన్నారు.

# గులాబీని కబళిస్తున్న కాళేశ్వరం

**కరీంనగర్, ఏప్రిల్ 6, పెన్ పవర్:**
తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. మూడు రోజుల కిందట కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. దాంతో పార్లమెంట్లో అమరావతి అంశంపై చర్చలోతమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామంగా మారింది.రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీల నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని ఆయన విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే రీ-డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు. అమరావతికి అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్న వేళ, బీఆర్ఎస్ సభ్యులు అనవసరంగా కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తెచ్చి అబాసుపాలయ్యారని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో కూడా ప్రాజెక్టు వైఫల్యంపై చర్చ జరగడం బీఆర్ఎస్



ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది.బ్యారేజీల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తీవ్రమైన లోపాలను ఎత్తిచూపింది. ఈ లోపాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అది నెమ్మదిగా సాగుతోందని మంత్రి పాటిల్ పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మీద కాళేశ్వరం అంశం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద అడ్డంకిగా మారింది. అటు కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో, ఇటు బీజేపీ జాతీయ స్థాయిలో ప్రాజెక్టు వైఫల్యాన్ని ఎండగడుతుండటంతో ఆ పార్టీ సమాధానం చెప్పుకోలేక సతమతమవుతోంది. కేవలం ఒక బ్యారేజీ కుంగిపోవడమే కాకుండా, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దీనిని కవర్ చేసుకునే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మరింత వివాదాలకు దారితీస్తుండటంతో గులాబీ దళం ప్రస్తుతం తీవ్ర నిర్వేదంలో ఉంది.

# పట్టు బిగిస్తున్న రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:**
రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు. మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అధిష్టానం ఎదుట మంచి మార్కులు సాధించుకొని.. గట్టి లీడర్ గా ఎదిగారు. కర్ణాటక.. ఇంకా కొన్ని ప్రాంతాలలో అధికారంలో ఉన్నప్పటికీ.. ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది.దేశంలో ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో కేరళ కూడా ఉంది. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రాన్ని చెందిన ఇతర ముఖ్య నేతలు కూడా ప్రస్తుతం కేరళలోనే మకాం వేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు.. ఫైర్ బ్రాండ్ లీడర్లు.. గట్టి స్వరం ఉన్న నాయకులు కేరళ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్న వారిలో దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. తన రాజకీయ జీవితంలో తొలిసారి కేరళ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. కేరళ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో నిర్వహిస్తున్న రోడ్డు షోలలో పాల్గొన్నారు. అక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్కేరళ రాష్ట్రంలో అధికార భాషగా మలయాళం ఉంది. దక్షిణ భారతదేశంలో మలయాళం అనేది అత్యంత క్లిష్టమైన భాష. అందువల్లే రేవంత్ ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో.. ఒక అనువాదకుడిని నియమించుకుంటున్నారు.. "మలయాళ ప్రజలకు నమస్కారం.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయండి. కేరళ రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏంటో కాంగ్రెస్ పార్టీ చూపించింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అంటూ మలయాళంలో రేవంత్ రెడ్డి పలుకుతున్నారు. ఆ ప్రసంగాలకు సానుకూల స్పందన లభిస్తుంది. రేవంత్ రెడ్డి ఇంగ్లీష్లో.. హిందీలో కూడా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారు కాబట్టి.. ఆ రెండు భాషలలో మాట్లాడుతూ మలయాళ ఓటర్ల మనసు చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. కేరళ ప్రజలకు హిందీతోపాటు ఇంగ్లీష్ కూడా వస్తుంది. అందువల్లే తెలంగాణ సీఎం మాటలకు కాస్త రీచ్ కనిపిస్తోంది.రేవంత్ రెడ్డి తో పాటు శ్రీధర్ బాబు కూడా మలయాళ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని మట్టుతారా నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. అక్కడ



బహిరంగ సభ కూడా ఏర్పాటు చేశారు. కేరళ అభివృద్ధికి యుడిఎఫ్ కట్టుబడి ఉందని.. యు డి ఎఫ్ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ఇక ప్రచారంలో రేవంత్ రెడ్డి పదేపదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి
విజయన్ పై కూడా విమర్శలు చేస్తున్నారు. మతపరమైన రాజకీయాలను కేరళ ప్రజలు ఒప్పుకోరని.. మతాలపరంగా విడిపోవడానికి సిద్ధంగా ఉండరని రేవంత్ రెడ్డి అంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెరచాటుగా ఒప్పందాలు చేసుకున్నారని.. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు రేవంత్..కాగా, ఈ స్థాయిలో ప్రచారం చేస్తున్నప్పటికీ సర్వేలలో మాత్రం కేరళ రాష్ట్రంలో విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలుస్తోంది. ఎల్డిఎఫ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో మాదిరిగా మెజారిటీ రాదని.. ఈసారి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత ముఖ్యమంత్రి కి తిరుగులేదని.. నగర ప్రాంతాలలో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు చెబుతున్నాయి.. సర్వేలలో వచ్చిన నివేదికలను ఒకసారి పరిశీలిస్తే కేవలం 30 శాతం మంది మాత్రమే విజయన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని.. ఇతర వ్యక్తులు ప్రత్యామ్నాయం ఉంటే బాగుంటుందని చెబుతున్నారని తెలుస్తోంది. అయితే మిగతా పార్టీలలో అగ్ర నాయకులు అంత గొప్పగా లేకపోవడం విజయన్ కు కలసి వస్తోంది.

# గడ్డి అన్నారం మార్కెట్‌లో మామిడి కొనుగోలు విక్రయాలపై అధికారుల పరిశీలన

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు : ఏ.ఎమ్.సి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి హెచ్చరిక





**ఎల్బీనగర్, పెన్ పవర్, ఏప్రిల్ 06:** బాటసింగారం పండ్ల మార్కెట్‌ను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎ.ఎమ్.సి) పాలకవర్గం సందర్శించింది. మామిడి పండ్ల సీజన్ నేపథ్యంలో జరుగుతున్న క్రయ విక్రయాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి సీజన్‌లో రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గత ఏడాది సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి నమోదు కాగా, ఈ ఏడాది ఇంకా ఎక్కువ వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. రైతులను అధిక కమిషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బకాయిలు చెల్లించని వ్యాపారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మామిడి పండ్ల పరిపక్వత కోసం ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ అనుమతించిన ఇతనాల్ మాత్రమే ఉపయోగించాలని అధికంగా లేదా అనుమతి లేని రసాయనాలు వాడితే లైసెన్సు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మార్కెట్‌లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రతి వారం పాలకవర్గం సమీక్ష చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాస్కర చారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చెందర్ రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, రఘుపతి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 6:** వేసవికాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ కూడలిలో మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం సర్పంచ్ బానోత్ పార్వతి ఉపసర్పంచ్ మహమ్మద్ జరీనా బేగం లు ప్రారంభించి చల్లని మంచినీటిని అందజేశారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రయాణికుల కోసం నెహ్రూ సెంటర్ కూడలి సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ప్రజలు ప్రయాణికులు బాటసారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మరి గూడెం సర్పంచ్ రామ్ సింగ్ వార్డు సభ్యులు పూర్ణ భారతి శ్రీను సాయికుమార్ ప్రముఖ వ్యాపారవేత్త కమల్ కుమార్ అగర్వాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ గౌడ్ హతిరాం ఉపేందర్ కోల కుమార్ ఎస్ కే యాకూబ్ పాషా బాబూలాల్ వెంకన్న గ్రామ పంచాయతీ సిబ్బంది దాసు శ్రీను తదితరులు ఉన్నారు.

# వెంకటేశ్వర్లు త్యాగం మరువలేనిది




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 6:** నిరంతరం ప్రజల సమస్యలపై గలమెత్తి సమస్యల పరిష్కారం దిశగా పోరాడిన కట్టెబోయిన వెంకటేశ్వర్లు చేసిన త్యాగం మరువలేనిదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారుమహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని మద్ది వంచ గ్రామంలో సోమవారం కట్టెబోయిన వెంకటేశ్వర్లు 21వ వర్ధంతి వేడుకలను సిపిఐ పార్టీ మద్దివంచ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆయన స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు తొలుత సిపిఐ శాఖ కార్యదర్శి ధూపాటి జనార్ధన్ జెండా ఆవిష్కరించారు అనంతరం ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమంలో కట్టెభోయిన వెంకటేశ్వర్లు పాత్ర మరువలేనిది. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం తన ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యల పై నిరంతరం కృషి చేసిన వ్యక్తి వెంకటేశ్వర్లు అని అన్నారు. ఈ ప్రాంతంలో ఇండ్లు ఇప్పించిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. ఆనాడు అతని ఆరోగ్యం సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజా సమస్యల పై గలమెత్తారని

అన్నారు. ఇప్పుడికి ప్రజల గుండెల్లో స్థిరస్తాయిగా నిలిచారని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అప్పుడే మనం ఆయనకి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న సీనియర్ నాయకులు కట్టెబోయిన బిక్షమయ్య రాగం రమేష్ గుగులోతు భీమ్లా రాగం సత్యనారాయణ ఇట్లూరి వెంకన్న దారావత్ వీరన్న రాగం బాబు రాగం రాము గుగులోతు సక్రు పూనెం వెంకన్న బండి ఉప్పయ్య సర్వర్ మియా తోకల పుల్లయ్య చౌకల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠధామం లో ఐమాక్స్ లైట్ ఏర్పాటు

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 6:** ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు గార్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాఖాల ఏటి వైకుంఠధామం వద్ద గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతీ నాయక్ ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేసి సోమవారం ఉప సర్పంచ్ మహమ్మద్ జరినా బేగం, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. రాత్రివేళల్లో వైకుంఠదామం వద్ద పడుతున్న ఇబ్బందులను తీర్చినందుకు మండల కేంద్ర ప్రజలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తుల దహన సంస్కారాలర్థం వచ్చిన ప్రజలు చీకటిలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు వారి సౌకర్యార్థం ఈ మ్యాక్స్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆమే పేర్కొన్నారు ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోలా కుమార్ గౌడ్, యాకుబ్ పాషా, కత్తుల ప్రశాంత్, ఎండి మోహిన్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 6:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, రావుక విమల్ కుమార్ జైన్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడం గర్వకారణమన్నారు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడం ద్వారా రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎనిమిదో వార్డ్ మెంబర్ బిజెపి పార్టీ అభ్యర్థి గా విజయం సాధించిన గుగులోత్ భారతి దేవా లను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ఇల్లందు అసెంబ్లీ కోకన్వీనర్ తోడేటి నాగరాజు జిల్లా నాయకులు అజ్మీర రాము ప్రధాన కార్యదర్శి గోనె సాయి కృష్ణ మండల నాయకులు వెంకలి బుచ్చిబాబు వీరియా నాయక్ సోనియా దేవా బూత్ అధ్యక్షులు వాసు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా మండరాముగౌడ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా శంషాద్ బేగం నియామకం





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 6:** కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన సెక్రటరీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు ఈ సందర్భంగా జిల్లా సెక్రెటరీ గా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియామకమైన మండ రాము గౌడ్ ఎస్.కె శంషాద్ బేగం లు మాట్లాడుతూ తమ నియామకం పార్టీ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు మహిళలకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతుగా కృషి చేస్తామన్నారు తమకు ఈ పదవి రావడానికి కృషి చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే కోరం కనకయ్య డిసిసి అధ్యక్షులు ఉమా మురళి నాయక్ మాజీ డిసిసి అధ్యక్షులు భరత్ చంద్రా రెడ్డి కాంగ్రెస్ పార్టీ గార్ల మండల అధ్యక్షులు దనియాకుల రామారావు మా ఎన్నికకు కృషిచేసిన గార్ల మండల కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# వడగాలులు...ఉక్కపోతలు...

**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఊపిరి ఆగిపోయేంతగా చెమటలు పడుతున్నాయి. ఇంట్లో కూర్చున్నా, బయటకు వచ్చినా వేడిగాలుల సెగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పలు చోట్ల పిడుగులు కూడా పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని చోట్ల మాత్రం తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లో శనివారం 73 మండలాల్లో తీవ్రవడగాలులు, 17 మండలాల్లో వడగాలులు, ఆదివారం 32 మండలాల్లో తీవ్రవడగాలులు, 21 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు

తీసుకోవాలని సూచించారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం 24, పార్వతీపురంమన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాల్లో తీవ్రవడగాలులు(73) వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్టీఆర్ 1, పల్నాడు 2 మండలాల్లో వడగాలులు(17) ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఏపీలో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది. 40-60కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. మరొకవైపు కొన్ని చోట్ల వానలు కూడా కురుస్తున్నాయి. ఆదిలాబాద్, కొమరం భీం, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే మిగిలిన జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నోదవుతాయని, వడగాల్పులు కూడా ఎక్కువగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ చెప్పింది. వడగాలుల వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్దులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి తాగాలని,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## మెరుగైన సౌకర్యాలతో అమృత్ భారత్ 3.0

**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:** రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు సరికొత్త చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రైళ్లను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉంది. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైళ్లు కేవలం నాన్ ఏసీ బోగీలతో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ 3.0 రైళ్లలో ఏసీ బోగీలను ఏర్పాటు చేస్తున్నారు. నమూనా కోచ్‌ను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం రోజున పరిశీలించారు.రైలు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ రైళ్లను తీసుకువచ్చింది. ఇప్పటికే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 1.0, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 2.0 వెర్షన్లు, అందుబాటులోకి రాగా.. త్వరలోనే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3 .0 ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 శాంపిల్ కోచ్‌ను న్యూఢిల్లీలో శనివారం పరిశీలించారు. ఈ వీడియోను ఎక్స్ ద్వారా షేర్ చేశారు రైల్వే మంత్రి. ప్రయాణీకుల భద్రత, సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, కొత్త డిజైన్లు, మెరుగైన టాయిలెట్ మోడల్స్ అభివృద్ధి చేసిందని రైల్వే మంత్రి తెలిపారు. ఒక బోగిని అప్ గ్రేడ్ చేసి.. రూపొందించిన శాంపిల్ కోచ్‌ను పరిశీలించినట్లు ట్వీట్ చేశారు.అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 వెర్షన్‌లో ఏసీ కోచ్‌లు, కొత్త ఇంటీరియర్ డిజైన్ ఉంటుంది. అలాగే అప్‌గ్రేడ్ చేసిన ఫీచర్లతో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇందులో నాన్-ఏసీ కోచ్‌లతో పాటు ఏసీ కోచ్‌లను కూడా ప్రవేశపెట్టనున్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 కోసం ప్రతిపాదించిన ఇంటీరియర్ డిజైన్‌లు, కలర్ స్కీమ్‌లతో కూడిన నమూనా కోచ్‌లను శనివారం అశ్వినీ వైష్ణవ్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైలు సర్వీసుల కంటే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రూపకల్పనలో భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం అమృత్ భారత్ రైళ్లల్లో కేవలం జనరల్, స్లీపర్ క్లాస్ మాత్రమే ఉన్నాయి. అయితే అమృత్ భారత్ 3.0 వెర్షన్‌లో ఏసీ కోచ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అమృత్ భారత్ 1.0, 2.0 రైళ్ల నిర్వహణ అనుభవంతో వీటిని రూపొందిస్తున్నారు.అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రైళ్లల్లో నాన్ ఏసీ కోచ్‌లతో పాటు ఏసీ కోచ్‌లు ఉంటాయి. అలాగే ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. రైళ్ల తయారీ పూర్తయిన అనంతరం.. రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్‌కు అధికారులు పంపిస్తారు. ట్రయల్స్, టెస్టులు పూర్తి అయిన తర్వాత అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, వందేభారత్ స్లీపర్, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ పేరుతో అధునాతన సౌకర్యాలతో భారతీయ రైల్వే.. సర్వీసులు అందుబాటులోకి తెస్తోంది.

## బడంగ్ పేటలో రూ.122 కోట్లు దోచేశారు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:**ఉన్నతమైన హోదా.. నెలకు లక్షలలో జీతం.. వాటికి మించిన సౌకర్యాలు.. ఇంకా రకరకాల సౌలభ్యాలు.. ఇన్ని ఉన్నప్పటికీ కూడా వారిలో ఆశ చావలేదు. ఇంకా సంపాదించాలని.. మరింత వెనకేయాలని అనుకున్నారు. కానీ చివరికి దొరికిపోయారు. హైదరాబాదు నగర పరిధిలోని బడంగ్ పేట మున్సిపాలిటీ కార్యాలయం ఉంది. ఇది శివారు ప్రాంతం కావడంతో భూ లావాదేవీలు.. ఇతర వ్యవహారాలు భారీగా సాగుతుంటాయి. ఇక్కడ భూముల ధర కూడా విపరీతంగా ఉంది. అందువల్ల తెర వెనుక వ్యవహారాలు చాలా జరిగిపోయాయి. ముఖ్యంగా బడంగ్పేట్ మున్సిపాలిలో పనిచేసే కొంతమంది అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాశారు. ప్రభుత్వానికి సొమ్ము వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఆ సొమ్ముతో తమ జేబులు నింపుకున్నారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 122 కోట్లు నొక్కేశారుప్రభుత్వ ఆదాయంలో తేడా రావడం.. ప్రభుత్వ ఖాతాకు డబ్బులు జమ కాకపోవడంతో ఉన్నతాధికారులకు అనుమానం వచ్చింది. మరో మాటకు తావు లేకుండా విజిలెన్స్ విచారణకు అధికారులు ఉపక్రమించారు. దీంతో బడంగ్ పేట మున్సిపాలిటీలో అంతర్గత విచారణ కొనసాగించారు.విజిలెన్స్ విచారణలో బడంగ్పేట్ మున్సిపాలిటీలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. మొత్తంగా 122 కోట్ల అవినీతి జరిగిందని అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో పదిమంది అధికారులకు పాత్ర ఉందని గుర్తించారు. డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న సరస్వతి.. మరో తొమ్మిది మంది అధికారులు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. ఆస్తి పన్ను నుంచి మొదలు పెడితే.. వెంచర్లకు అనుమతులు వరకు ఇలా అన్ని విషయాలలో అవినీతికి పాల్పడ్డారు. మొత్తంగా 122 కోట్లను నొక్కేశారు. ప్రాథమిక చర్యగా పదిమంది అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన ప్రభుత్వం.. తదుపరి చర్యలను తీసుకోవడానికి సిద్ధమవుతోంది.ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మున్సిపాలిటీలో అవినీతి వ్యవహారం జోరుగా సాగింది. సిబ్బంది అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడ్డారు. ఏసీబీ అధికారులకు ఈ విషయం తెలియడంతో రంగంలోకి దిగారు. తనిఖీలు చేపట్టారు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించగా.. బడంగ్ పేట మున్సిపాలిటీ అయితే అవినీతిలో రికార్డు సృష్టించింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన నేపథ్యంలో.. సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

## రోహిత్ రెడ్డికో ట్రీట్ మెంట్.. కవితకు మరోలా....

**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:** ధర్మం అనేది అందరికీ ఒక తీరుగా ఉండాలి. న్యాయం అనేది అందరికీ ఒకే విధంగా లభించాలి. తప్పు చేస్తే పడే శిక్ష కూడా సమానంగా ఉండాలి. అలా కాకుండా ఆశ్రిత పక్షపాతాన్ని చూపిస్తేనే ఇబ్బంది కలుగుతుంది.. ఇప్పుడు ఈ ఉపోద్ఘాతం మొత్తం ఎందుకంటే.. ఈ స్టోరీ చదవండి మీకే తెలుస్తుంది.లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న తర్వాత కల్వకుంట్ల కవిత భారత రాష్ట్ర సమితి నుంచి ఒక రకమైన ఒత్తిడి ఎదుర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అనేక రకాలుగా ప్రయాసపడితే ఆమె తండ్రి అపాయింట్మెంట్ లభించలేదు. అది కూడా నిమిషాల్లోనే జరిగిపోయింది. పార్టీలో తనకి ఎదురవుతున్న అనుభవాలను తట్టుకోలేక ఆమె విలేకరుల ముందుకు వచ్చారు. తన బాధను మొత్తం పంచుకున్నారు. ఆగమేఘాల మీద పార్టీ అధిష్టానం ఆమెను సస్పెండ్ చేసింది. దీంతో ఆమె పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసింది. ఇప్పుడు సొంత పార్టీ పెట్టే ఆలోచనలో ఆమె ఉంపార్టీ కోసం తాను ఎంతో కష్టపడితే ఇంత ఇబ్బంది పెడుతున్న క్రమంలో.. ఆమె వాస్తవాలను చెప్పడం మొదలుపెట్టారు. తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితి పెద్దగా చేసింది ఏమీ లేదని.. సామాజిక తెలంగాణ ను ఏర్పాటు చేయడంలో భారత రాష్ట్ర సమితి విఫలమైందని ఆమె ఆరోపించారు. అంతేకాదు.. భూ కుంభకోణాలు.. ఇతర వ్యవహారాలను ఆమె బయట పెట్టుకుంటూ వస్తూనే ఉన్నారు. హరీష్ రావును గుంట నక్క అని.. సంతోష్ రావును అవకాశవాది అని ఆమె విమర్శించుకుంటూ వస్తున్నారు.ఇక ఇటీవల మొయినాబాద్ ఫామ్ హౌస్ లో మాదకద్రవ్యాల పార్టీ నిర్వహించి వివాదంలో చెప్పుకున్నారు తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి. ఆయన వ్యవసాయ క్షేత్రంలో మాదకద్రవ్యాలు లభించిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యవహారంలో పోలీసులపై కాల్పులకు పాల్పడేందుకు రోహిత్ రెడ్డి అనుచరులు ప్రయత్నించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో ఇంకా చాలామందికి పాత్ర ఉందని పోలీసులు భావిస్తున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తూ కీలకమైన విషయాలను బయటపెడుతున్నారు.. మాదకద్రవ్యాల పార్టీ వెలుగులోకి వచ్చిన తర్వాత రోహిత్ రెడ్డికి ఆలస్యంగా భారత రాష్ట్ర సమితి షోకాజు నోటీస్ ఇచ్చింది. వారంలో దీనికి సమాధానం చెప్పాలని గడువు ఇచ్చింది.రోజులు గడుస్తున్న కొద్దీ ఇంతవరకు రోహిత్ రెడ్డి షో కాజు నోటీసుకు సమాధానం చెప్పలేదు. అంతేకాదు, ఇంతవరకు రోహిత్ రెడ్డి మీద భారత రాష్ట్ర సమితి కఠినమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కవిత విషయంలో కఠినంగా వ్యవహరించిన భారత రాష్ట్ర సమితి.. రోహిత్ రెడ్డి విషయానికి వచ్చేసరికి సైలెంట్ అయిపోయింది. అతడు శోకాజ్ నోటీస్ కు సరైన స్థాయిలో సమాధానం ఇవ్వకపోయినప్పటికీ భారత రాష్ట్ర సమితి పట్టించుకోవడం లేదు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తాం.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ద్రోహం చేసింది. ప్రజలను మోసం చేస్తోంది అని పదే పదే చెబుతున్న భారత రాష్ట్ర సమితి నాయకులు.. ఇంటి ఆడబిడ్డ విషయంలో ఒక విధంగా.. అభియోగాలు ఎదుర్కొంటున్న నాయకుడి విషయంలో మరొక విధంగా వ్యవహరించడం ఏ విలువలకు నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై భారత రాష్ట్ర సమితి అధినాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కళింగ కల్చరల్ సెంటర్లో ఏర్పాటుచేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను నగర సోషలైట్ పల్లవి ఠాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేనేతకారులు ప్రదర్శించిన వస్త్ర ఉత్పత్తులను ఆమె తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంచారని వివరించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సనాతన సంప్రదాయానికి విఘాతం...
# ధర్మపురి దేవస్థానంలో నిత్యకైంకర్యాల సంక్షోభం

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ కాశీగా, నవ నరసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రైమూర్త్య మూల విరాట్టుల ఆవాస స్తానమై, యుగయుగాల పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక నేపథ్యం కలిగి ఉందిపవిత్ర గోదావరీ తీర తీర్థం, ప్రాచీన క్షేత్రం ధర్మపురి. బ్రహ్మాండ స్కంద పురాణాల్లో ఈ క్షేత్ర గొప్పతనం ప్రశంసింప బడింది. .అనాదిగా వేద వేదాంగ శాస్త్రాగమ సంప్రదాయాలకు నిలయంగా వెలుగొందుతున్న ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక పరంపర, ఆచార వ్యవస్థ, అర్చన క్రమాల సమన్వయానికి ఒక అపూర్వ నిదర్శనంగా నిలుస్తోంది. గోదావరి తీరం మీద విరాజిల్లే ఈ క్షేత్రం భక్తుల కోరికలను తీర్చే వరప్రదుడైన శ్రీ యోగానంద నరసింహ స్వామి ప్రధాన ఆలయంగా విశిష్ట స్థానం సంపాదించుకుంది. స్మార్త, వైష్ణవ ఆగమాల సమన్వయంతో నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించబడటం ఈ క్షేత్ర ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఉదయం వేళల్లో బ్రాహ్మణ వేద పండితులు పంచోపనిషత్ యుక్త వేద పారాయణాలు, అవధారయ పఠనాలు నిర్వహించగా, అదే సమయంలో వైష్ణవ అర్చకులు యోగానంద నరసింహ స్వామి, లక్ష్మీదేవి మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, నివేదనలు సమర్పించడం సనాతన సంప్రదాయం కొనసాగింపుగా నిలుస్తోంది.ఈ క్రమంలో ముఖ్యంగా గమనించాల్సిన అంశం వంశపారంపర్య హక్కులఆధారంగా వేద పారాయణ బాధ్యతలు నిర్వహిస్తున్న పండితుల పరిస్థితి. ప్రస్తుతం వేద పారాయణం నిర్వహిస్తున్న నలుగురు పండితులు ఒకే వంశానికి చెందినవారు కావడం విశేషం. సంప్రదాయ పరిరక్షణలో ఇది ఒక వైపు నిబద్ధతను ప్రతిబింబిస్తే, మరోవైపు ఆచరణలో సమస్యలకు దారితీస్తోంది. ముఖ్యంగా జాత లేదా మృత శౌచం వంటి కుటుంబ సంబంధిత ఆచారాలు వచ్చినప్పుడు వారందరూ ఒకేసారి శౌచ నియమాలకు లోబడటంతో వేద పారాయణం నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీని ప్రభావం దేవాలయ నిత్యకైంకర్యాలపై ప్రత్యక్షంగా పడుతోంది.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని కొన్ని సంవత్సరాల క్రితం దేవస్థానం యాజమాన్యం ఒక సామవేద పండితుని నియామకానికి కృషి చేసి అవకాశం కల్పించింది. ఈ నిర్ణయం స్థానిక భక్తుల్లో, ఆచార పరిరక్షణకు కట్టుబడిన వర్గాల్లో విశేష సంతోషాన్ని కలిగించింది. వేద పారాయణ వ్యవస్థలో వైవిధ్యం పెరిగి, ఆచారాల్లో అంతరాయం లేకుండా కొనసాగుతుందనే ఆశలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ ఆశలు ఎక్కువకాలం నిలవలేదు. సదరు సామవేద పండితుడు వివిధ కారణాలతో డిప్యూటేషన్‌పై రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మరో దేవాలయానికి కేటాయించబడి, అక్కడే విధులు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది.దేవస్థానం అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఈ సమస్యను వివరించి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరినా కార్యాచరణలో ఫలితం కనిపించలేదు. పునరావృతంగా పైరవీలు జరిగినప్పటికీ సదరు పండితుడు తిరిగి ధర్మపురికి చేరకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఈ నేపథ్యంలో దేవాలయ నిత్యకైంకర్యాలు నిరంతరాయంగా కొనసాగించేందుకు స్థానికంగా అందుబాటులో ఉన్న వేద పండితులను అభ్యర్థించి తాత్కాలికంగా ఉచిత స్వచ్ఛంద సేవలను వినియోగించడం జరుగుతోంది. యజుర్వేద పండితులు శౌచ నియమాలను పాటించే సమయంలో ఇతర పండితులను ఆహ్వానించి వేద పారాయణాలు నిర్వహించడం ద్వారా కార్యక్రమాలు కొనసాగించాల్సి వస్తోంది.

ఇలాంటి తాత్కాలిక ఏర్పాట్లు కొంతవరకు సమస్యను అధిగమించగలిగినా దీర్ఘకాలిక పరిష్కారంగా పరిగణించలేము. దేవాలయ ఆచార వ్యవస్థలో స్థిరత్వం, పరిపాటీ కొనసాగాలంటే నిర్దిష్టంగా నియమించబడిన వేద పండితులు తమ విధులను నిర్వర్తించడం అత్యవసరం. ముఖ్యంగా ధర్మపురి వంటి ప్రాచీన క్షేత్రాల్లో ఆగమ శాస్త్రాల ప్రకారం పూజలు, వేద పారాయణాలు క్రమబద్ధంగా జరగడం అత్యంత కీలకం.తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాల సంఖ్య సుమారు 33 వేలకుపైగా ఉందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. వీటిలో పెద్ద, మధ్య, చిన్న దేవాలయాలుగా వర్గీకరణ చేయబడింది. అయితే వేద పండితుల కొరత అనేది చాలా ఆలయాల్లో సాధారణ సమస్యగా మారింది. ప్రత్యేకంగా వంశపారంపర్య విధానంపై ఆధారపడిన ఆలయాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన పండితులపై ఆధారపడటం వల్ల అనివార్య పరిస్థితుల్లో ఆచారాల నిర్వహణకు ఆటంకాలు కలుగుతున్నాయి.ఈ నేపథ్యంలో ధర్మపురి దేవస్థానంలో నెలకొన్న పరిస్థితి ఒక ప్రతీకాత్మక ఉదాహరణగా నిలుస్తోంది. వేద పారాయణ వ్యవస్థను బలోపేతం చేయడానికి వివిధ వేద శాఖలకు చెందిన పండితులను నియమించడం, డిప్యూటేషన్ విధానాన్ని క్రమబద్ధీకరించడం, స్థానిక అవసరాలను ప్రాధాన్యంగా పరిగణించడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే నియమించబడిన పండితులను తమ అసలు విధుల ప్రదేశంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవడం అత్యవసరం.క్షేత్రవాసులు, భక్తులు ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ దేవస్థానంలో ఆచార వ్యవస్థకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని వారు కోరుతున్నారు. డిప్యూటేషన్‌పై ఉన్న సామవేద పండితుడిని తిరిగి ధర్మపురికి పంపించి వేద పారాయణ వ్యవస్థను పునరుద్ధరించాలని వారు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక ఆలయానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు; సనాతన ధర్మ పరిరక్షణకు

సంబంధించిన అంశం కూడా.మరో గమనించదగిన అంశం ఏమిటంటే, దేవస్థాన సంబంధిత మతాతీత సిబ్బందిలో ఉద్యోగిని మరెక్కడికైనా పంపినప్పుడు పెద్దగా ఇబ్బందులు తలెత్తకపోవచ్చు. కానీ మతపరమైన, ఆచార వ్యవహారాలు నిర్వహించే అర్చకులు, వేద పండితులను డిప్యూటేషన్‌పై తరలించడం ద్వారా ఆచార వ్యవస్థలో అంతరాయం ఏర్పడి సంప్రదాయాలకు భంగం వాటిల్లే అనివార్య పరిస్థితులు ఏర్పడతాయి. ఈ సున్నితమైన అంశాన్ని అధికారులు లోతుగా అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.అంతిమంగా ధర్మపురి క్షేత్రం వంటి ప్రాచీన దేవాలయాల్లో ఆచార పరంపరల సంరక్షణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యతగా భావించాలి. అయితే పరిపాలనా పరంగా అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం మాత్రం ప్రభుత్వ యంత్రాంగం చేతుల్లోనే ఉంది. అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డిప్యూటేషన్‌పై ఉన్న పండితుడిని తిరిగి విధుల్లోకి తీసుకురావడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భక్తజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ మాస్టర్ స్ట్రోక్....



**హైదరాబాద్, ఏప్రిల్ 6, పెన్ పవర్:** కూటమి వ్యూహం ఎవరికి అంతుపట్టడం లేదు. ముఖ్యంగా ఏపీ విషయంలో బిజెపి పెద్దల వైఖరి ప్రత్యర్థులకు కూడా అందడం లేదు. మొన్నటి వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెరవెనుక బిజెపి సహకారం అందిస్తుంది అనేది బలమైన ప్రచారం. అందుకు తగ్గట్టుగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం బిజెపి అడగకుండానే పెద్ద ఎత్తున తన మద్దతు తెలుపుతూ వచ్చింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులు, వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించిన విచారణ జాప్యం వంటివి ఆ రెండు పార్టీల మధ్య స్నేహం ఉన్నట్టు అనుమానం కలిగించేలా ఉండేవి. మరోవైపు వైసీపీ నేతలు సైతం తమకు బిజెపి స్నేహం కొనసాగుతుందని అర్థం వచ్చేలా వ్యవహరించేవారు. కానీ అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం తీసుకున్న చొరవ తో వైసీపీతో బిజెపి స్నేహం పై ఒక స్పష్టత వచ్చింది. వారి మధ్య ఎటువంటి సంబంధం లేదని తేలిపోయింది.మరోవైపు ఏపీలో సీఎం చంద్రబాబు తో పాటు ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. ఆయన అడిగిన వెంటనే ప్రధాని మోదీ అపాయింట్మెంట్ ఇస్తున్నారు. నిన్ననే ప్రధానిని కలిశారు లోకేష్. రాజ్యసభ గ్యాలరీలోకి వెళ్లారు. కేంద్ర మంత్రులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే అటు నుంచి అడ్డు అన్నట్టు కర్ణాటక వెళ్లారు నారా లోకేష్. అక్కడ కేంద్ర మంత్రులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లోకేష్ కు అక్కడ ఘనస్వాగతం లభించింది. ఉత్సాహంగా కర్ణాటకలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు లోకేష్.ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి రాజకీయాలు చేస్తున్నారు. ఢిల్లీ కాంగ్రెస్ ను వ్యతిరేకిస్తున్న ఆయన కర్ణాటక కాంగ్రెస్ సేవలను మాత్రం వినియోగించుకుంటున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీలో కూడా అదే అనుమానం ఉంది. వచ్చే ఎన్నికల్లో కర్ణాటకలో అధికారంలోకి రావాలని భావిస్తోంది బిజెపి. వైసీపీ భావజాలం కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా ఉంటుంది. అందుకే అది కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి వైసీపీ సహకరిస్తుంది అనేది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు కర్ణాటకలో అధికారంలోకి రావాలంటే సరిహద్దు ప్రాంతాల్లో టిడిపి కూటమి సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది బిజెపి. అందుకే లోకేష్ ను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. మరోవైపు తమిళనాడులో పవన్ కళ్యాణ్ సేవలు వినియోగించుకుంటుంది. కర్ణాటకలో మాత్రం లోకేష్ సేవలను వినియోగించుకోవడం ద్వారా అధికారంలోకి రావాలని భావిస్తోంది. మొత్తానికి అయితే దక్షిణాది రాష్ట్రాల విషయంలో బిజెపి పెద్దలు గట్టి వ్యూహంతోనే ఉన్నారు.జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి జాతీయ రాజకీయ పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారన్న అనుమానం బీజేపీలో ఉంది. ఎందుకంటే కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో చాలామంది సన్నిహితులు జగన్ మోహన్ రెడ్డికి ఉన్నారు. అయితే తెలంగాణలో సైతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. కానీ అక్కడ చంద్రబాబు సన్నిహితుడు రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారు. అందుకే జగన్ కర్ణాటకను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో ఉండి అక్కడి నేతల సహకారం తీసుకొని ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. ఈ సమాచారం బిజెపికి ఉండడం వల్లే లోకేష్ ను కర్ణాటకలో ప్రయోగిస్తోందన్న టాక్ వినిపిస్తోంది.

# ‘మావిగన్’ ట్రెండింగ్...

**విజయవాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:** సోషల్ మీడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చ్టయించినట్లు ప్రచారం సాగుతోంది.గత రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మీట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మీట్‌లో మచిలీపట్నం – విజయవాడ – గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. మచిలీపట్నంలో హీూ, విజయవాడలో ఎ×, గుంటూరులో +ఖచీను తీసుకుని మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది.మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది.ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు.

ఆచరణలో ఎపుడయ్యేన్ ?

ఏపీలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఒక ప్రతిపాదన అమరావతి రాజధానికి ఆల్టర్నేషన్ గా చేసింది. దానిని ప్లాన్ బీగా చెప్పుకుంటోంది. దానికి మావిగన్ అని పేరు కూడా పెట్టారు. అయితే ప్రత్యర్థులతో పాటు విమర్శలు బుద్ధి జీవులు అంతా అది మావిగన్ కాదు ఎండమావిగన్ అని అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రతిపాదన చాలా ఆలస్యంగా వచ్చింది. అంతే కాదు ఇపుడు ఏపీలో ఉన్న పరిస్థితుల్లో దీని సాధ్యాసాధ్యాలు






పరిశీలించిన వారు అయ్యేది ఉండదని అంటున్నారు.. అది ఆచరణలో అయ్యేనా అంటే కాదనే చెబుతారు. ఎందుకంటే అమరావతికి ఇపుడు చట్ట బద్ధత అనే రాజ్యాంగ భద్రత ఉంది. అంతే కాదు న్యాయపరమైన రక్షణ కూడా ఉంది. అమరావతి రాజధానిగా ఏపీకి నిర్ణయిస్తూ పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రపతి రాజ ముద్రతో ఇక రావడమే ఆలస్యం. అది కూడా జరిగి తీరుతుంది. అలాంటి అమరావతిని కదపడం సాధ్యమా అంటే అసాధ్యం అని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు: ఇక రేపటి రోజున ఏపీలో వైసీపీ అధికారం చేపడితే అమరావతికి బదులుగా మావిగన్ అంటూ రాజధాని మార్పు చేయడం సాధ్యమేనా అంటే కాదనే చెబుతారు. ఎలా అంటే పార్లమెంట్ లో మెజారిటీ సభ్యులు విభజన చట్టంలోని సవరణను ఆమోదించాలి. నిన్న అంతా చూశారు, అధికార బీజేపీ విపక్ష కాంగ్రెస్ సహా దేశంలోని అన్ని పార్టీలు అమరావతికి జై కొట్టాయి. మళ్లీ అమరావతి కాదు మావిగన్ పేరుని చేర్చాలని అంటే మాత్రం వారు ఎందుకు అంగీకరిస్తారు. పైగా అక్కడ అప్పటికి ఎంతో కొంత నిర్మాణాలు జరుగుతాయి కదా ఆ భూములను ఏమి చేస్తారని ప్రశ్నించకుండా ఉండరు కదా అని మేధావులు అంటున్నారు. ఇక 2019లో అయితే అమరావతిలో ఏమీ వర్క్ జరగలేదు కాబట్టి వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు అని ప్రతిపాదించగలిగింది. అయినా సరే న్యాయ స్థానాలలో అది వీగిపోయింది. కానీ ఎంత కాదనున్నా 2029 నాటికి అమరావతి రాజధానికో కీలక ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూములలో నిర్మాణాలు జరిగితే యాక్టివిటీ స్టార్ట్ అవుతుంది. కానీ ఆ విషయం ఎవరూ చెప్పలేరు కానీ కూటమి ప్రభుత్వం అయితే పట్టుదలగా ఉంది కాబట్టి ఈ విషయంలో కొంత మేర ప్రగతి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ముందుకు సాగుతారు తప్ప వెనక్కి వెళ్ళేది ఉండదు, దాంతో రేపటి రోజున వైసీపీకి అధికారం దఖలు పడి ఆ పార్టీ ఎంపీల మద్దతు కేంద్రానికి అవసరం అయినా ఈ విషయంలో మాత్రం కేంద్రం నుంచి సాయం చేసేది ఉండదు, పైగా ఒక చోట రాజధాని అనుకుని కొంత పనులు చేసి మళ్ళీ మారుస్తామంటే జనాలు కూడా నెగిటివ్ అవుతారు అన్నది అంతా గుర్తుంచుకోవాల్సి ఉంది.అయితే వైసీపీ అధికారంలోకి వస్తే మాత్రం మావిగన్ పేరుతో విజయవాడ గుంటూరు, మచిలీపట్నమలో కొంత మేర అభివృద్ధి చేయవచ్చు. లేదా ఇంకా ముచ్చట పడితే సీఎం ఆఫీసు కూడా అక్కడ నుంచి నడపవచ్చు కానీ అమరావతి రాజధాని మాత్రం అలాగే చట్టబద్ధతతో ఉంటుంది. పైగా అమరావతిలోనే అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఉంటే వేరే చోట నుంచి పాలన జరిపించడం కూడా ఆచరణలో అంత సహేతుకం అనిపించుకోదు. ఏది ఏమైనా మావిగన్ అన్నది ఎండమావిగా మారుతుందా అన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# విదేశాల్లో పర్యటన చేస్తే. అంతరాలయాల్లో పూజలు నిషేధం

**విజయవాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:**
విదేశీ పర్యటనలు చేసి వచ్చిన అర్చకులు దేవాలయాల్లోని ప్రధాన గర్భాలయాల్లోకి ప్రవేశించి పూజలు నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ (ధార్మిక పరిషత్), శృంగేరి శారదా పీఠం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం, విదేశాలకు వెళ్లొచ్చిన అర్చకులు గర్భాలయంలోకి ప్రవేశించడానికి వీలులేదని, ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్‌పై ఉందని ఏపీ కోర్టు పేర్కొంది.విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి చెందిన శ్రీచక్ర నవావరణ అర్చన పారాయణదారు డీఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం సోమయాజి దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2010లో దేవాదాయ శాఖ జారీ చేసిన సర్క్యులర్, అలాగే 2024 డిసెంబరులో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీతీర్థ స్వామి వారు విడుదల చేసిన ప్రామాణికమైన మార్గదర్శకాలను ఆలయాల్లో పాటించడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది కేఆర్ శ్రీనివాస్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటన చేసిన వారిని గర్భాలయ పూజలకు అనుమతించడం ఆచార విరుద్ధమని వాదించారు.శృంగేరి శారదా పీఠం జగద్గురువులు మహాతీర్థ భారతీస్వామి నిబంధనల ప్రకారం, అర్చకులు విదేశాలకు వెళ్లడంపై ఆంక్షలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా వెళ్లాల్సి వస్తే, వారు తిరిగి వచ్చిన తర్వాత కేవలం ఆలయం వెలుపల జరిగే పూజలు, వ్రతాలకు మాత్రమే పరిమితం అవుతారు. గర్భాలయంలో పూజలు నిర్వహించే వారు ఖచ్చితంగా త్రికాల సంధ్యావందనం,

వేద అధ్యయనం, ఆహార నియమాలతో పాటు కఠిన ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటించాలని శారదా పీఠం గతంలోనే స్పష్టం చేసింది. అదే నిబంధనలు చాలా చోట్ల అమలవుతున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు లేదా సంప్రదాయాలకు విరుద్ధంగా జుట్టు కత్తిరించుకున్న వారు (క్షవరం చేయించుకున్న వారు) గర్భాలయ ప్రవేశానికి అనర్హులని కోర్టు గుర్తు చేసింది. ఈ నిబంధనలను తప్పకుండా పాటిస్తామని దేవాదాయ శాఖ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు

# అమరావతి మార్పు సాధ్యమా...



**ఒంగోలు, ఏప్రిల్ 5, పెన్ పవర్:**
అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందింది. త్వరలో రాష్ట్రపతి సంతకం చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే దీనిపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆ బిల్లును మార్చేస్తాం అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడు బిల్లు పెట్టిన మాదిరిగానే.. తాము చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. అప్పటినుంచి ఆయనకు అనుకూలురు సైతం అదే తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్నకు కొంతమంది విశ్లేషకుల ముసుగులో సాధ్యమే అని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. అది ప్రజలతో ముడిపడే విషయం కాగా.. మరోవైపు కోర్టు పరిధిలో కూడా ఉంది. ఈ విషయం తెలియక చాలామంది విశ్లేషణల రూపంలో ప్రజల్లో అయోమయాన్ని సృష్టిస్తున్నారు.అమరావతి మార్పు విషయంలో జగన్మోహన్ రెడ్డి చెబుతున్న మాటలను పరిగణలోకి తీసుకుంటే.. ముందుగా ఆయన అంతులేని విజయం సాధించాలి. ఆయనకు అనుకూలమైన ప్రభుత్వం కేంద్రంలో రావాలి. అప్పుడే ఆ బిల్లు మరోసారి మార్పునకు కొంతవరకు అవకాశం ఉంటుంది. అయితే అప్పుడు కూడా అది రాజకీయ అంశంగా మారనుంది. ఎందుకంటే అప్పటికి అమరావతికి ఒక రూపం వస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతుంది. వాటిని మారిస్తే మాత్రం ప్రజావ్యతిరేకత రావడం ఖాయం. ఎందుకంటే ఏ రాష్ట్రం కూడా రాజధానిని మార్పు చేస్తున్న దాఖలాలు లేవు. కానీ జగన్మోహన్ రెడ్డి పదేపదే రాజధానులను మారిస్తే ప్రజలు ఊరుకోరు. రాజకీయాలు విపరీతంగా ప్రభావితం అవుతాయి కూడా. జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డి నవ్వుల పాలవుతారు కూడా. ప్రస్తుతం జగన్ వైఖరి చూస్తుంటే మారుస్తాం అని చెప్పడం లేదు. కేవలం అమరావతి విషయంలో దూకుడుగా ప్రభుత్వం ముందుకెళ్తున్న వేళ.. కొంత రాజకీయ అయోమయం సృష్టించేందుకే ఈ ఎత్తుగడ అని స్పష్టం అవుతుంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో తిరుగులేని విజయం సాధించింది. అప్పుడే అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. కానీ అప్పటికే ఏపీ రాజధాని అమరావతి అని రికార్డుల్లో నమోదయింది. ఆయన మూడు రాజధానుల ప్రయత్నం చేస్తున్న సమయంలోను కేంద్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం అమరావతి రాజధాని అని తేలిపోయింది. మరి అంతటి బలంలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఒప్పించలేకపోయారు. పాలన వికేంద్రీకరణ కోసమే తాను మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నానని చెప్పలేకపోయారు. ఎందుకంటే అప్పుడు 22 మంది పార్లమెంట్ సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్నారు. తనకు విలువనిచ్చే ఎన్ డి ఏ ప్రభుత్వం ఉంది. పైగా తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబుకు కేంద్ర పెద్దలు వ్యతిరేకంగా ఉన్నారు. ఆ సమయంలోనే తాను పట్టుబడి తెరపైకి తెచ్చిన మూడు రాజధానులను అమలు చేయలేకపోయారు జగన్మోహన్ రెడ్డి.మరోవైపు న్యాయ చిక్కులను కూడా అధిగమించలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తీసుకున్నప్పుడు ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించారు అమరావతి రైతులు. వారిని ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. కేసులతో ఉక్కిరి బిక్కిరి చేశారు. రాజధాని అంటే ఆ 29 గ్రామాలకు సంబంధించిన అంశంగా భావించారు. కానీ అమరావతి రైతులు న్యాయ పోరాటం చేశారు. ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజనల్ బెంచ్ అమరావతి రైతులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఇష్టపడని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సుప్రీం కోర్టులో ఆ కేసు పెండింగ్లో ఉంది. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చట్టపరంగా మూడు రాజధానుల విషయంలో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించింది. ఎందుకంటే అమరావతి రాజధాని విషయంలో రైతులతో ఒప్పందం ప్రధాన అడ్డంకి కానుంది. అందుకే సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా.. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. కేవలం కోర్టులో ప్రతికూలత వస్తుందని భావించి అప్పట్లో ఆ నిర్ణయం తీసుకుంది.తాజాగా అమరావతికి చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చినప్పుడు.. విశ్లేషకుల ముసుగులో కొందరు వైసిపి అనుకూలురు కొత్త ప్రతిపాదన తెచ్చారు. పార్లమెంటులో చట్టబద్ధత కంటే రాష్ట్ర ప్రభుత్వ పరంగా సుప్రీంకోర్టులో ఉన్న కేసును వెనక్కి తీసుకోవచ్చు కదా అనేది వారి సూచన. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పని చేసింది. అమరావతి ఏకైక రాజధాని అంటూ అఫిడవిట్ దాఖలు చేసింది. కానీ సుప్రీం కోర్టులో ఆ కేసు విచారణకు రాలేదు. ఒకవేళ వచ్చినా హైకోర్టు అమరావతికి అనుకూల తీర్పు ఇచ్చిన దృష్ట్యా దానికే కట్టుబడి ఉండాలని ఆదేశాలు ఇస్తుందని న్యాయ నిపుణులు సైతం చెబుతున్నారు. ఒకసారి సుప్రీంకోర్టు ఆ తీర్పు ఇచ్చిందంటే మరోసారి.. అమరావతి రాజధాని మార్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉండదు. అయితే రాజకీయపరంగా చాలా రకాల వ్యాఖ్యలు చేయవచ్చు కానీ.. కొన్నింటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయలేం. ఇప్పుడు అమరావతి విషయంలో జగన్మోహన్ రెడ్డికి ఎదురైన పరిస్థితి అదే. అంతులేని మెజారిటీతో ఆయన గెలవాలి. ఆయనకు అనుకూలమైన కేంద్ర ప్రభుత్వం రావాలి. ఆపై సంకీర్ణ ప్రభుత్వంలో మిగతా రాజకీయ పార్టీలు సహకరించాలి. ఇంత జరిగిన తరువాత మాత్రమే రాజధానిని కదిలించగలరు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంతకుముందే అంతులేని మెజారిటీతో గెలిచిన ఆయన అమరావతిని అంగుళం కదిపించలేకపోయారు. ఒకవేళ అధికారంలోకి వచ్చినా ఆయన అమరావతిని కొనసాగించాలి తప్ప వేరే ఆప్షన్ లేదన్న టాక్ కూడా ఉంది. సో ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలంతా కేవలం రాజకీయ గందరగోళం కోసమేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. అమరావతి శాశ్వతం అంటున్నారు.

## ఆ ఐదుగురు హిట్ లిస్టే...

**గుంటూరు, ఏప్రిల్ 5,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పేశారు. తరచూ వివాదాల్లో ఇరుక్కునే ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని చెప్పారు. అంటే ఎమ్మెల్యేలకు స్పష్టంగా చెప్పేశారు. ఏమాత్రం వివాదాల్లో ఇరుక్కున్నా తాను టిక్కెట్ ఇచ్చేది లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్యలు ఉండకపోవచ్చు. కానీ భవిష్యత్ లో మాత్రం వారికి టిక్కెట్ ఇచ్చే విషయంలో ఈ వివాదాలన్నీ కౌంట్ అవుతాయని చంద్రబాబు ఎమ్మెల్యేలకు చెప్పకనే చెప్పేశారు. ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వారు చెవికెక్కించుకోకపోవడంతో పాటు ఇంకా ఎమ్మెల్యేలు రెచ్చిపోతుండటంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు.ఇటీవల టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనేక మంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా మంది ఎమ్మెల్యేలు గీత దాటినట్లు చంద్రబాబుకు స్పష్టంగా అర్థమయింది. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ అయితే తీసుకున్నారు కానీ, సస్పెండ్ చేయలేదు. సస్పెండ్ చేయకపోనంత మాత్రాన చేతకాని తనం అని చూస్తూ ఊరుకోవద్దని అన్నారు. గీత దాటితే ఖచ్చితంగా సస్పెండ్ చేస్తామని చెప్పారు. అలాగే వైఖరి కొనసాగితే సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హింట్ ఇచ్చారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, నరసరావు పేట ఎమ్మెల్యే అరవింద బాబు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం లుమాత్రం ట్రబుల్ లో ఉన్నట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెను వెంటనే వీరిపై చర్యలు తీసుకోకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త నేతలకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయినట్లు తెలిసింది.ఎవరు తోక జాడించినా.. ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం లేదు కానీ, వచ్చే ఎన్నికల్లో మాత్రం టిక్కెట్ లభించదన్నది స్పష్టంగా చంద్రబాబు చెప్పినట్లయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేల్లో మార్పు వస్తుందా? లేదా?అన్నది చూడాల్సి ఉంది.

**కాఫీ కబుర్లతో ఆకట్టుకుంటున్నలోకేష్**

కాఫీ కబుర్లు– పేరుతో టిడిపి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోంది. టిడిపి కేంద్ర కార్యాలయంలో గత కొన్ని రోజులుగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు, అదే విధంగా క్లస్టర్ ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి.. ప్రత్యర్థుల పై ఏ విధంగా పై చేయి సాధించాలి... అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విషయంపై తర్ఫీదు ఇస్తున్నారు. చంద్రబాబు సహా మంత్రి లోకేష్ తీసుకువస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే అంశాలపై ఏ విధంగా ప్రచారం చేయాలని అంశాలను వారికి వివరిస్తున్నారు. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీని గెలుపు గుర్రం ఎక్కించడమే లక్ష్యంగా ఈ శిక్షణ జరుగుతోంది. దీనిలో భాగంగా –కాఫీ కబుర్లు– అనే పేరుతో వినూత్న కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నారు.. దీనిని ప్రధానంగా ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు, అదేవిధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో నారా లోకేష్ రెండుసార్లు పార్టీ కార్యాలయానికి వచ్చారు. చంద్రబాబు సైతం రెండుసార్లు పార్టీ ఆఫీస్ కి వచ్చారు. ఈ సందర్భంగా –కాఫీ కబుర్లు– పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, పార్టీలో నాయకులకు – కార్యకర్తలకు మధ్య ఉన్న రిలేషన్ అడిగి తెలుసుకుంటున్నారు. ఏవిధంగా ముందుకు సాగాలి. ఉన్నత స్థాయి ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజల వరకు పార్టీని ఏ విధంగా ముందుకు నడిపించాలనే అంశంపై వారు చర్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిత్రమైన విషయం ఏమిటంటే అందరితోపాటు కూర్చుని కాఫీ తాగుతూ వారితో ముచ్చటించడం. ఎవరు ఏం చెప్పినా వినే అవకాశం ఇవ్వడం... ప్రధానంగా కార్యకర్తలను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో వ్యక్తిగత అంశాలకు కూడా ప్రాధాన్య ఇస్తున్నారు. కొంతమంది కార్యకర్తలు తమ కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావిస్తుంటే ఓపికగా వింటున్నారు. పార్టీ పరంగా అయితే వారు చెప్పింది వింటూనే మరికొన్ని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మొత్తంగా –కాఫీ కబుర్లు– కార్యక్రమం టిడిపిలో ఒక ఆసక్తికర పరిణామంగా మారింది. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి నెలకొంది. ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం టిడిపికి ఇదే తొలిసారి. గతంలో బిజెపి –చాయ్ పే చర్చా– వంటి కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో టిడిపి కాఫీ కబుర్లు పేరుతో కార్యక్రమాన్ని ఎంచుకుని నిర్వహించడం ద్వారా కార్యకర్తలకు మరింత చేరువ అయ్యేలా వ్యవహరిస్తోంది.

## టీడీపీకి మరింత మంది మహిళా లీడర్లు...

**కాకినాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:** టీడిపికి మరింత మంది మహిళలు అవసరం అవుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం పార్టీలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ అధినేత సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న రాష్ట్రస్థాయి కమిటీలో మహిళల రిజర్వేషన్ పెంచాలని భావిస్తున్నారు. తద్వారా 33% మేరకు పార్టీ పదవుల్లో ముఖ్యంగా రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళలకు అవకాశం దొరుకుతుంది. ఇది ఒక రకంగా పార్టీ ఆవిర్భావం తర్వాత సంచలన నిర్ణయం అనే చెప్పాలి. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళా నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఇప్పుడు 33 శాతం మందిని ఖచ్చితంగా నియమించాలని పార్టీ నిర్ణయించింది. తద్వారా మెజారిటీ మహిళ నాయకులకు రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం దొరుకుతుంది. మరోవైపు నియోజకవర్గాల సంఖ్య పెరిగితే.. మహిళా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కూడా మరింత మంది మహిళ నాయకులు అవసరం ఏర్పడుతుంది. దాదాపు 80 నియోజకవర్గాలపైగా మహిళలకు కేటాయిస్తారన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఆమేరకు మహిళా నాయకత్వాన్ని పెంచుకునేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. దీనికి ప్రధానంగా రెండు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. 1) సంస్థాగతంగా పార్టీలో ఉన్న మహిళా నాయకులు. అదేవిధంగా వారసత్వంగా పార్టీకి సేవ చేస్తున్న నేతలు. 2) యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో పార్టీ వేస్తున్న అడుగులు, తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఆకర్షితులవుతున్న యువతులను పార్టీలోకి తీసుకుని వారికి పదవులు కట్టబెట్టాలని భావిస్తోంది, అయిన ప్పటికీ నాయకత్వం పరంగా చూసుకున్నప్పుడు మహిళల సంఖ్య తక్కువగా ఉంది. ఈ క్రమంలో మహిళా నాయకత్వాన్ని పెంచుకునే దిశగా ఏ విధంగా ముందుకు సాగాలి.. ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలి.. అనే విషయంపై చంద్రబాబు పార్టీ సీనియర్లకు బాధ్యతలు అప్పగించారు. ఎవరిని పడితే వారిని కాకుండా పార్టీకి సంస్థగతంగా ఉండేలాగా సామాజిక వర్గాలపరంగా అదే విధంగా బడుగు బలహీనవర్గాల నుంచి కూడా మహిళా నాయకులను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బీసీలు ఎక్కువ మంది ఉండేలా చూడనున్నారు. ఎందుకంటే ఆది నుంచి టిడిపి బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో వారి తరఫున బలమైన గళం వినిపించే మహిళా నాయకులకు ఇప్పుడు అవకాశం దక్కనుంది. మొత్తంగా టిడిపికి మరింత మంది మహిళా నాయకుల అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

రాయపాటి అరుణకు చాన్స్

రాజధాని అమరావతి ఉద్యమకారిణిగా గుర్తింపు సాధించి కూటమి ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన రాయపాటి శైలజ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్నారా? ఆమెను పార్టీలో చేర్చుకుని రాజధాని ప్రాంతంలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి నిలపాలని టీడీపీ అధిష్టానం భావిస్తోందా? ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే ఈ అనుమానాలు నిజమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారని, దీంతో కొత్తగా సమర్థులైన మహిళా నేతలను రంగంలోకి దింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు. రాజకీయ నేపథ్యం నుంచి వచ్చినప్పటికి రాయపాటి శైలజకు ఇప్పటివరకు ఏ పార్టీతో సంబంధం లేదని అంటున్నారు. గతంలో అమరావతి రాజధానిని కాపాడుకునేందుకు రైతులు చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన శైలజ టీడీపీ అధిష్టానం దృష్టిని ఆకర్షించారని చెబుతున్నారు. ఆమె కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉన్నప్పటికీ శైలజ మాత్రం ఆ పార్టీ తరఫున ఇప్పటివరకు పనిచేయలేదని, కేవలం అమరావతి ఉద్యమం వరకు పరిమితమయ్యారని అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాజధాని ఉద్యమం కూడా ఒక కారణంగా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పట్లో ఉద్యమంలో ముందుండి నడిపిన రాయపాటి శైలజ తెగువను మెచ్చుకుని మహిళా కమిషన్ గా నియమించారు. ఇక ఇప్పుడు కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు అవుతుండటం, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాల్సివుండటంతో రాయపాటి శైలజను పార్టీలోకి తీసుకువచ్చి ఆమె సేవలను రాజకీయంగా వాడుకోవాలని టీడీపీ హైకమాండ్ భావిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా ఉన్న రాయపాటి శైలజ పదవీకాలం రెండేళ్లు మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే సగం పదవీకాలం పూర్తికావడంతో మిగిలిన సమయం ముగిసిన తర్వాత రాయపాటి శైలజను ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జిగా నియమించాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. సామాజికంగా ఆర్థికంగా కూడా ఆమె బలంగా ఉండటంతో ఏ స్థానం అప్పగించాలనే విషయమై టీడీపీ హైకమాండ్ తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు నియోజకవర్గాలను పరిశీలిస్తున్నారని, అదేవిధంగా కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలు, మహిళా రిజర్వేషన్ కు అవకాశం ఉండే స్థానాలను పరిశీలిస్తున్నారని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఆ సంకేతం ఇరాన్ ట్రాప్ అనుకొన్నాం: ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడే ఆపరేషన్ సమయంలో కొంతసేపు టెన్షన్ నెలకొన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆ ఫైటర్ జెట్ నుంచి ఎజెక్ట్ అయిన రెండో పైలట్ ఇరాన్ దళాల నుంచి తప్పించుకొని.. పర్వతాల్లో దాక్కొన్నాడని.. తొలుత అమెరికా నిఘా విభాగం అతడి లొకేషన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. కానీ, అతడి వద్ద నుంచి వచ్చిన సందేశం తమను గందరగోళంలో పడేసిందని ట్రంప్ తెలిపారు. రేడియో సిగ్నల్స్‌లో 'భగవంతుడిదే శక్తి' అన్నట్లు వినిపించిందని.. అది ముస్లింలు మాట్లాడినట్లు అనిపించిందన్నారు. ఆ తర్వాత ఆ సిగ్నల్‌ను 'గాడ్ ఈజ్ గుడ్'గా మిలిటరీ అధికారులు వెల్లడించారు. దీంతో అతడు ఇరాన్ దళాలకు దొరికిపోయి ఉంటాడని అనుమానించారు. వారే తప్పుడు సిగ్నల్స్‌ను ట్రాన్స్‌మిట్ చేస్తున్నట్లు భావించారు. కానీ, ఆ తర్వాత సదరు పైలట్ సజీవంగానే ఉన్నాడని గుర్తించారు. వాస్తవానికి యుద్ధం, విపత్కర పరిస్థితుల్లో దళాల సభ్యులు చిక్కుకొన్నవేళ వెంటనే ముందుగా అనుకొన్న కోడ్‌ను మర్చిపోయి.. సహజసిద్ధ శైలిలో స్పందిస్తుంటారు. ఈ పైలట్ విషయంలో కూడా అలానే జరిగింది. దీంతో కొంతసేపు టెన్షన్ నెలకొన్నా.. ఆ తర్వాత వచ్చిన కోడ్ సరైనదేనని నిర్ణయించుకొని ఆపరేషన్ చేపట్టారు.

## ఇరాన్‌పై భీకర వైమానిక దాడులు.. 13 మంది మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తార స్థాయిని చేరుకున్నాయి. యూఎస్ మిలిటరీ స్థావరాలు, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇటీవల ఇరాన్ కొన్ని దాడులు చేసింది. వాటికి ప్రతీకారంగా సోమవారం తెల్లవారుజామున ఇరాన్‌పై(×తీుఅ) భీకర వైమానిక దాడులు జరిగాయి. అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఈ దాడులు చేసినట్టు తెలుస్తోంది. నిర్దేశించిన గడువులోగా హర్మూజ్ జలసంధిని నౌకల రాకపోకలకు వీలుగా తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుదుత్పత్తి కర్మాగారాలను నామరూపాల్లేకుండా చేస్తామని, నరకం చూపిస్తామని ఇటీవల టెహ్రాన్‌ను ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఇరాన్‌పై దాడులు జరగడం గమనార్హం. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పాలక భవనాలే లక్ష్యంగా క్షిపణులు దూసుకొస్తున్నాయి. ఈ క్రమంలోనే 13 మంది మృతి చెందడంతో పాటు పలువురికి గాయాలైనట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధానిలోని షరీఫ్ యూనివర్సిటీపై వైమానిక దాడులు జరిగాయి. ఈ ఘటనలో క్యాంపస్ భవనం తీవ్రంగా దెబ్బతినడంతో పాటు పరిసరాల్లోని సహజవాయువు సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసమయ్యింది. యుద్ధం కారణంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దాడులు జరిగిన సమయంలో క్యాంపస్‌లో ఎవరూ లేరని, దీంతో ప్రాణాపాయం తప్పిందని స్థానిక మీడియా తెలిపింది. "దేశ ప్రజలను లక్ష్యంగా చేసుకొని శత్రువులు దాడి చేస్తున్నారు. మా పౌరులను టార్గెట్ చేస్తే ప్రతీకారం తీవ్రస్థాయిలో ఉంటుంది. అందరూ అప్రమత్తంగా ఉండండి" అంటూ ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ హెచ్చరికలు జారీ చేసింది. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప మాట మీద నిలబడే వ్యక్తి కాదు. ఏ సమయంలో ఏం చేస్తారో తెలియదు. ఆయన ప్రవర్తన గురించి ఇరానియన్లు, అమెరికన్లు ఎవరూ అంచనా వేయలేరు. హర్మూజ్ జలసంధిని మొత్తం ప్రపంచం కోసం తెరిచి ఉంచినా ఇరాన్ శత్రువులకు మాత్రం మూసే ఉంటుంది" అని దేశ సాంస్కృతిక మంత్రి రెజా సాల్హీ అమిరీ పేర్కొన్నారు.

## కోల్‌కతానూ టార్గెట్ చేస్తాం
## మరోసారి పాక్ మంత్రి ప్రేలాపన

**హైదరాబాద్ పెన్ పవర్:** భవిష్యత్‌లో భారత్ తమపై ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని, ప్రతి దాడులను ఆ ప్రాంతం వరకు తీసుకుని వెళ్తామని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి ప్రేలాపనలు చేశారు. తన స్వస్థలం సియాల్‌కోట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి, వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్టు నివేదికలు ఉన్నాయని ఆరోపించారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకుని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల భారత్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు.

## పిక్చర్ అభీ బాకీ హై..!
## ఆప్ నేతలకు రాఘవ్ చద్దా కౌంటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో అంతర్గత విభేదాలు ముదిరాయి. సొంత పార్టీ నేతలు తనపై విమర్శలపై రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా స్పందించారు. పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించటం లేదన్న ఆరోపణలను తిప్పికొడుతూ, తాను రాష్ట్రం కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఓ వీడియో క్లిప్‌ను పంచుకున్నారు. రాజ్యసభలో ఆయన పంజాబ్ సమస్యలపై మాట్లాడుతున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. 'రాఘవ్ చద్దా పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించటంలో విఫలమయ్యారని అంటున్న నా సహచరులకు ఇదే నా సమాధానం. ఇది ఒక చిన్న ట్రైలర్ మాత్రమే. పిక్చర్ అభీ బాకీ హై' అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించిన తర్వాత ఈ వివాదం మొదలైంది. సొంతపార్టీ నేతలు ఆయనపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై రాఘవ్ చద్దా స్పందిస్తూ, 'నాపై ఒకే రకమైన ప్రశ్నలు, ఒకే రకమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు.. పరస్పర సహకారంతో చేస్తున్నారు ఇదంతా. నేను మౌనంగా ఉంటే, పదే పదే చెప్పే అబద్ధం.. నిజంలా అనిపిస్తుంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బుషెర్ అణు కర్మాగారంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత

### అణు కాలుష్య ప్రమాదంపై ఇరాన్ హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ మౌలిక సదుపాయాలపై, ముఖ్యంగా బుషెర్ అణు విద్యుత్ కేంద్రంపై జరిగిన దాడులతో సహా, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులను ఖండిస్తూ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఐక్యరాజ్యసమితికి ఒక లేఖ రాశారని అల్ జజీరా పేర్కొంది.ఇటువంటి సైనిక చర్యల పరిణామాలపై అరాఘ్చి ఆందోళనను వ్యక్తం చేశారు. టెలిగ్రామ్‌లో పంచుకున్న ఆ లేఖలో, ఇరాన్ మంత్రి ఈ దాడులు తీవ్రమైన మానవ, పర్యావరణ పరిణామాలతో కూడిన రేడియోధార్మిక కాలుష్యం ప్రభావం మొత్తం ప్రాంతాన్ని గురిచేస్తుంది, అని నొక్కి చెప్పారు.బుషెర్ ప్లాంట్‌కు సమీపంలోని ప్రాంతాలను ఇటీవల లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు. క్రియాశీలకంగా ఉన్న బుషెర్ అణు విద్యుత్ కేంద్రం పరిసరాల్లో ఆక్రమణదారులు పదేపదే జరుపుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.అల్ జజీరా ప్రకారం, ఈ దాడులు రేడియోధార్మిక విడుదలకు కారణమై, తీవ్ర ప్రమాదాన్ని సృష్టించగలవని అరాఘ్చి హెచ్చరించారు. క్రియాశీలకంగా ఉన్న అణు కేంద్రానికి సమీపంలో ఈ దాడులు జరగడం భరించలేని పరిస్థితిని సృష్టిస్తుంది, ఇది రేడియోధార్మిక విడుదలకు అవకాశాన్ని కలిగిస్తుంది అని ఆయన అన్నారు.ఇరాన్ రాజధాని తెహ్రాన్‌కు దక్షిణాన సుమారు 750 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుషెర్ కేంద్రం, రష్యా నుండి సేకరించిన తక్కువ గాఢత కలిగిన యురేనియంను ఉపయోగించి సుమారు 1,000 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది.పశ్చిమ ఆసియాలో గత నెల రోజులకు పైగా కొనసాగుతున్న యుద్ధంలో, అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులు నిర్వహించాయి. వాస్తవానికి, తెహ్రాన్ అణు కార్యక్రమాన్ని (దానిపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో) పూర్తిగా తుడిచిపెట్టడమే ఈ దాడుల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలలో ఒకటి.శనివారం ఉదయం, బుషెర్ అణు విద్యుత్ కేంద్రం పరిసరాల్లోకి ఒక క్షిపణి దూసుకొచ్చి పడటంతో, కనీసం ఒక భద్రతా సిబ్బంది మరణించినట్లు ఇరాన్ వార్తా సంస్థ 'తస్నీమ్' వెల్లడించింది.ఆ నివేదిక ప్రకారం, ఈ ఘటన వల్ల విద్యుత్ కేంద్రంలోని ప్రధాన భాగాలు దెబ్బతినలేదు. అయితే, ఒక అనుబంధ భవనానికి మాత్రం నష్టం వాటిల్లింది. కాగా, విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి అంతరాయం కలగలేదని సమాచారం.ఇరాన్ మౌలిక సదుపాయాలైన వంతెనలు, విద్యుత్ కేంద్రాలతో సహా ఇతర లక్ష్యాలపై దాడులు జరపవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన వెంటనే ఈ దాడి జరిగింది.సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేసిన ఒక సందేశంలో, ఇరాన్‌లో ఇంకా మిగిలి ఉన్నవాటిని ధ్వంసం చేయడం అమెరికా సైన్యం ఇంకా ప్రారంభించనే లేదు అని ట్రంప్ పేర్కొన్నారు.

# తీవ్రమైన ఇరాన్ ప్రతీకార దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెహ్రాన్ సమీపంలోని మౌలిక సదుపాయాలపై ఇటీవల అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే బహ్రెయిన్, కువైట్‌లలోని పెట్రోకెమికల్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని తాజా దాడులు జరిపినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. హెర్మూజ్ జలసంధి విషయంలో డొనాల్డ్ ట్రంప్ విధించిన 48 గంటల గడువు సమీపిస్తున్న తరుణంలో, పౌర లక్ష్యాలపై ఇంకేమైనా దాడులు జరిగితే మరింత బలమైన, విస్తృతమైన ప్రతిస్పందన ఉంటుందని ప్రభుత్వ మీడియా ప్రచురించిన ఒక ప్రకటనలో గార్డ్ హెచ్చరించింది.

### ప్రతీకారం, హెచ్చరిక

కరాజ్‌లోని ఒక వంతెనపై, కీలక పెట్రోకెమికల్ సంస్థలపై జరిగిన దాడులకు ప్రత్యక్ష ప్రతిస్పందనగా ఈ దాడులు జరిగాయని, ఇవి ప్రతీకార చర్యలో భాగమని రివల్యూషనరీ గార్డ్ పేర్కొంది. ఇలాంటి చర్యలు పునరావృతమైతే, మరింత తీవ్రతతో రెండో విడత దాడులు జరుగుతాయని అది హెచ్చరించింది.హెర్మూజ్ జలసంధికి సంబంధించిన డిమాండ్లను తెహ్రాన్ పాటించకపోతే, ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, డీశాలినేషన్ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించడంతో, గల్ఫ్ అంతటా పెరిగిన ఆందోళనల మధ్య ఈ ప్రకటన వెలువడింది. ఈ హెచ్చరిక, కీలకమైన ఆర్థిక ఆస్తులకు సంబంధించిన విస్తృత ప్రాంతీయ ఘర్షణకు దారితీస్తుందనే భయాలను పెంచింది.

### బీరూట్ దాడి పరిస్థితిని తీవ్రతరం చేసింది

సమాంతరంగా జరుగుతున్న ఈ ఉద్రిక్తతలో, ఇజ్రాయెల్ దళాలు బీరూట్ దక్షిణ శివారులోని జ్నా ప్రాంతంపై దాడి చేశాయి. ఈ దాడిలోని శక్తివంతమైన పేలుడు శబ్దం లెబనీస్ రాజధాని అంతటా వినిపించింది. ఇజ్రాయెల్ జెట్‌లు నగరంపై తక్కువ ఎత్తులో ఎగురుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇది వారి వైమానిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సూచిస్తూ, మరిన్ని దాడులపై ఆందోళనలను పెంచుతోంది.ఈ సంఘర్షణ భౌగోళికంగా విస్తరించడం, బహుముఖ ఉద్రిక్తతకు దారితీసే ప్రమాదాన్ని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఈ సంక్షోభంలోకి లెబనాన్ ను కూడా క్రమంగా లాగుతున్నారు.పరస్పర విరుద్ధమైన వాదనలు సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయిదక్షిణ ఇస్ఫహాన్‌లో రెండు సి-130 రవాణా విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లతో సహా పలు అమెరికా విమానాలను కూల్చివేసినట్లు ఇరాన్ అంతకుముందు ప్రకటించింది. ఒక క్లిష్టమైన ఆపరేషన్‌లో కూల్చివేసిన ఎఫ్-15 యుద్ధ విమానం నుండి ఒక పైలెట్ ను అమెరికా దళాలు విజయవంతంగా రక్షించాయని ట్రంప్ ధృవీకరించిన తర్వాత ఈ ప్రకటన వెలువడింది.గడువులు సమీపిస్తుండటం, ప్రతీకార బెదిరింపులు తీవ్రమవుతుండటంతో పరిస్థితి అత్యంత అస్థిరంగా ఉంది.

## బహుళ రాష్ట్రాలతో అనుసంధానం ఉన్న, ఐఎస్ ఐఎస్ సంబంధాలున్నట్లు
# అనుమానిస్తున్న నెట్‌వర్క్‌ను ఛేదించిన ఎపి పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశీ హ్యాండ్లర్లు, ఐఎస్ ఐఎస్ సహా తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక అనుమానిత ఉగ్రవాద ముఠాను వెలుగులోకి వచ్చింది. ఈ నెట్‌వర్క్ భారతదేశంలోని యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లిస్తోందని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు.ఈ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురితో సహా దాదాపు డజను మంది అనుమానితులను అరెస్టు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు బీహార్, ఢిల్లీ, కర్నాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, రాజస్థాన్ వంటి పలు రాష్ట్రాలకు బృందాలను పంపిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది.పీటీఐ వార్తా సంస్థ ఉటంకించిన నిఘా విభాగపు వర్గాల ప్రకారం, ఈ బృందానికి విదేశాలలో ఉన్న ఆపరేటివ్‌లతో సంబంధాలు ఉన్నాయి. ఇది ఆన్‌లైన్‌లో జిహాదీ ప్రచారాన్ని చురుకుగా వ్యాప్తి చేస్తోంది.విదేశీ హ్యాండ్లర్లు, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్), అల్-ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఎక్యూఐఎస్) వంటి తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్న ఒక జిహాదీ మాడ్యూల్‌ను వెలికితీశారు. ఇది భారతదేశంలోని యువతను తీవ్రవాదం దిశగా నడిపించడంలో నిమగ్నమై ఉంది, అని ఒక నిఘా విభాగపు అధికారి తెలిపారు.ప్రధాన నిందితుడు, అతని సహచరులు యువతను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ ప్రచారాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ నెట్‌వర్క్‌లో ప్రధాన నిందితుడు రహమతుల్లా షరీఫ్ కీలక వ్యక్తి అని దర్యాప్తు అధికారులు గుర్తించారు. జిహాదీ కంటెంట్‌ను వ్యాప్తి చేయడంలో, ఆన్‌లైన్ వీడియోల ద్వారా యువతను ప్రేరేపించడంలో పాలుపంచుకున్న కార్యకర్తలతో షరీఫ్, అతని సహచరులు సంబంధాలు కలిగి ఉన్నారని పోలీసులు తెలిపారు.నిందితులు సోషల్ మీడియా ద్వారా తీవ్రవాద భావజాలాన్ని పంచుకుంటూ, విదేశీ హ్యాండ్లర్లతో సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ముస్లిం యువతను జిహాద్, తీవ్రవాద భావజాలం వైపు ప్రభావితం చేసే ప్రయత్నంలో, ఒసామా బిన్ లాడెన్, ఇస్రార్ అహ్మద్ షేక్, జాకిర్ నాయక్, అన్వర్ అల్-అవ్లాకీలకు సంబంధించిన వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఈ బృందంపై ఆరోపణలు ఉన్నాయి.

ఈ నెట్‌వర్క్, 'ఖవాతీన్' అనే ప్రత్యేక విభాగం ద్వారా మహిళలను చేర్చుకుని విస్తరించడానికి ప్రయత్నిస్తోందని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, బంగ్లాదేశ్‌లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారుదర్యాప్తు అధికారుల ప్రకారం, ఈ బృందం 40కి పైగా సోషల్ మీడియా ఖాతాల ద్వారా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, బంగ్లాదేశ్‌లలో ఉన్న హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకుంది.ఈ నెట్‌వర్క్ 'హిజ్రత్'కు సౌకర్యం కల్పించి, చివరికి భారతదేశంలో ఇస్లామిక్ రాజ్యం లేదా 'ఖిలాఫత్'ను స్థాపించాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని ఏజెన్సీలు భావిస్తున్నాయి.అల్-హకీమ్ షకూర్, మహమ్మద్ హుజైఫా, నింజా, హెమ్రాక్సీ, అబు ముహారిబ్ ,అబు బలూషీగా గుర్తించిన హ్యాండ్లర్లు, ఈ బృందానికి ఉగ్రవాద శిక్షణ, స్నైపర్ రైఫిల్స్‌తో సహా ఆయుధాల వాడకంపై మార్గనిర్దేశం చేశారని ఆరోపణలు ఉన్నాయి. వారు ఆయుధాలను సరఫరా చేయగలమని కూడా ఆ బృందానికి హామీ ఇచ్చారని సమాచారం.

ఈ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న కొందరు తీవ్రవాద భావజాలం గల వ్యక్తులు అప్పటికే విదేశాల్లోని మదర్సాలలో జిహాదీ శిక్షణ పొందుతున్నారని, అదే సమయంలో ఈ నెట్‌వర్క్‌లోకి మరింత మందిని చేర్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.నిందితులలో ఒకరైన సయిదా బేగం, పాకిస్థాన్‌తో పాటు జమ్మూ కాశ్మీర్‌లోని కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండి, జిహాదీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ప్రణాళిక వేస్తున్నారని పీటీఐ నివేదించింది.సైబర్ ఉగ్రవాదం, ఐఈడీ సామగ్రి, భారత్ వ్యతిరేక కంటెంట్‌పై కూడా దర్యాప్తు జరుగుతోంది.ఈ బృందం కేవలం భావజాల ప్రచారానికే పరిమితం కాలేదని, సైబర్ ఉగ్రవాదం, బాంబుల తయారీకి సంబంధించిన కంటెంట్‌ను కూడా పంచుకుంటూ ఉండవచ్చని అనుమానిస్తున్నట్టు దర్యాప్తు అధికారులు తెలిపారు.అధికారిక వెబ్‌సైట్‌లను హ్యాక్ చేసే ప్రణాళికలతో సహా, సైబర్ దాడులను ప్రోత్సహించే మెటీరియల్‌ను నిందితులు ప్రచారం చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నెట్‌వర్క్‌తో ముడిపడి ఉన్న విదేశీ నిధుల మార్గాలను కూడా ఏజెన్సీలు పరిశీలిస్తున్నాయి.

బ్లాక్ పౌడర్, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఇడిల) తయారీకి సంబంధించిన మెటీరియల్‌ను సభ్యులు అప్‌లోడ్ చేశారని, అలాగే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ నుండి తుపాకులను సేకరిస్తామని కూడా పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. భారతదేశంలో ఇస్లామిక్ రాజ్యం అనే ఆలోచనకు తమ నిబద్ధతను చాటుకోవడానికి, ఈ బృందం సభ్యులు మాస్కులు ధరించి, ఐసిస్ జెండాలను ప్రదర్శిస్తూ, "ఒకే ఉమ్మత్" వంటి నినాదాలు చేస్తున్న ఫోటోలను పోస్ట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి.నిందితులు రెచ్చగొట్టే వీడియోలను పంచుకున్నారని, దుర్భాషలు వాడుతూ భారత జాతీయ గీతాన్ని అవమానకర రీతిలో పాడారని, జాతీయ జెండాను అగౌరవపరచడం, తగలబెట్టడాన్ని చూపే కంటెంట్‌ను ప్రచారం చేశారని కూడా దర్యాప్తు అధికారులు ఆరోపించారు.

# పోషకాహార లోపం...వ్యాధులకు మూలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ), ఇతర సంబంధిత సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య అవగాహన దినం.1948లో, ఔనూ మొదటి ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించింది. 1950 నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించింది. ఔనూ స్థాపనకు గుర్తుగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుంది. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి.భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

# ఎల్పీజీ కష్టాలు కిలో రూ.500కి చేరిక

**భారంగా 'ఛోటా' సిలిండర్**

**పేదలు, వలస కార్మికులకు తప్పని తిప్పలు**

**బ్లాక్ మార్కెట్ దందాను కట్టడి చేయలేని ప్రభుత్వాలు**



మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా దేశంలో ఎల్పీజీ సరఫరా తీవ్రంగా దెబ్బతింది. దీని ప్రభావం 5 కిలోల 'చోటు' సిలిండర్‌పై పడింది. బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.400-500 వరకు అమ్ముడవుతోంది. దీంతో పేదలు, విద్యార్థులు, వలసకార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. బ్లాక్ మార్కెట్ దందా తీవ్రమైంది. కట్టడి చేయాల్సిన ప్రభుత్వాలు ఈ విషయంలో తీవ్రంగా విఫలమవుతున్నాయి.

న్యూఢిల్లీ : మధ్యప్రాచ్య యుద్ధం వల్ల ఎల్పీజీ సరఫరా తీవ్రంగా ప్రభావితమైంది. 14.2 కిలోల గృహ సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో రూ.3000 వరకు అమ్ముడవుతోంది. అధికార ధర మాత్రం రూ.914 మాత్రమే. 5 కిలోల సిలిండర్ రీఫిల్ ధర కిలోకు రూ.400-500కు పెరిగింది. ఈ పరిస్థితిలో చిన్న సిలిండర్ ధర పెద్దదాని కంటే ఎక్కువైంది. అందుకే 'ఛోటా' సిలిండర్ ఇప్పుడు 'పెద్దది'గా మారిందని భావిస్తున్నారు. వలసకార్మికులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ఈ ఐదు కిలోల సిలిండర్‌పై ఆధార పడుతుంటారు. కానీ ప్రస్తుత ధరల వల్ల రీఫిల్ చేయించడం మోయలేని భారంగా మారుతోంది. నోయిడాకు చెందిన పునీత్‌కుమార్ తన పాత ఐదు కిలోల చోటు సిలిండర్‌ను తిరిగి ఉపయోగించాలని భావించాడు. కానీ ఎల్పీజీ కొరత కారణంగా దాన్ని రీఫిల్ చేయించుకోలేకపోయాడు. ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో, సాధారణ 14 కిలోల సిలిండర్ కోసం వేచి ఉండడమే మంచిదనుకున్నాడు.నోయిడాలోని రాహుల్ రంజన్ కూడా కిలోకు రూ.400 చెల్లించాలని అడిగారని చెప్పారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) చట్టబద్ధంగా 'చోటు', 'మినీ', 'అప్పు' అనే ఐదు కిలోల సిలిండర్లను అందిస్తున్నాయి. కానీ వాటి లభ్యత సమస్యగా మారడం ఆందోళనకరమని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రభుత్వం సరఫరా నిలకడగా ఉంటుందని చెప్పినా.. చాలా చోట్ల పది నుంచి 45 రోజుల వరకు సిలిండర్ డెలివరీ ఆలస్యం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గొడవలకు దిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చిన్న సిలిండర్‌పై ఆధారపడే వలస కార్మికులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అధిక ధరల కారణంగా కొంతమంది తమ గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారు. నోయిడాలోని ఒక స్ట్రీట్ ఫుడ్ విక్రేత గ్యాస్ కొనలేక బొగ్గు స్టవ్‌కు మారాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ తర్వాత అతను స్వగ్రామానికి వెళ్లిపోయాడు. చిన్న సిలిండర్ ఒకప్పుడు మధ్యతరగతి వారికి గుర్తుగా ఉండేది.ఇప్పుడు అదే పేదలకు జీవనాధారం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని పొందడం కష్టమైంది. ముంబయి, ఢిల్లీ వంటి నగరాల్లో చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఈ సిలిండర్లపై ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు వాటి రీఫిల్ ధరలు అధికంగా ఉండటంతో వ్యాపారం కొనసాగించడం కష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్ దందా సాగుతోంది. పోలీసులు బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా.. అక్రమ దందా మాత్రం ఆగటం లేదు. ప్రభుత్వం ఈ మినీ సిలిండర్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వలస కార్మికులకు 30,000 సిలిండర్లు పంపిణీ చేశారు. మార్చి 23 తర్వాత 3.9 లక్షల సిలిండర్లు అమ్ముడయ్యాయి. అయితే ధర కూడా పెరిగి రూ.649కు ఎగబాకింది. ఈ సిలిండర్లు సులభంగా పొందవచ్చని కంపెనీలు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చాలా చోట్ల అవి అందుబాటులో లేవని ప్రజలు చెప్తున్నారు. బుకింగ్ చేసినా స్టాక్ లేదని చెప్పడం, హెల్ప్‌లైన్ పని చేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

**ఆరు శాతానికి తగ్గింపు : మూడీస్ నివేదిక**




న్యూఢిల్లీ : మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్పీజీ రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్పీజీ కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది.

"పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రయివేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026-27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం" అని మూడీస్ నివేదిక తెలిపింది."ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి" అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

# దిగుమతి బిల్లు తడిసిమోపెడు..!



**రూపాయి పతనం, చమురు ధరల ఎఫెక్ట్**

**పెరుగుతోన్న వాణిజ్య లోటు**

**పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు**

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ పాతాళానికి పడిపోవడం, చమురు ధరలు అమాంతం పెరగడం భారతదేశ దిగుమతి బిల్లును తడిసిమోపెడు చేయనుంది. ప్రస్తుతం దిగుమతి బిల్లు ప్రస్తుతం రెండు వైపుల నుండి ముప్పును ఎదుర్కొంటోంది. ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతుండగా, మరోవైపు అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఓ దశలో 95 కనిష్ట స్థాయికి పడిపోతోంది. ఈ రెండింటి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి ఎదుర్కోనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హార్ముజ్ తీర ప్రాంతంలో సరఫరా అంతరాయాలు చోటు చేసుకున్నాయి. భారత్ తన అవసరాలకు కావాల్సిన చమురుతో పాటు ఎలక్ట్రానిక్స్, బంగారం, ఎరువులు, పారిశ్రామిక యంత్రాలను ప్రధానంగా డాలర్లలోనే చెల్లింపులు చేసి దిగుమతి చేసుకుం టుంది. చమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనత ఏకకాలంలో సంభవించడం వల్ల వాణిజ్య లోటు పెరగడమే కాకుండా దేశీయం గా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**చమురు ధరలు రెట్టింపు..**

ఈ ఏడాది జనవరి 1 నుండి మార్చి 27 మధ్య కాలంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 60.75 డాలర్ల నుండి ఏకంగా 105.32 డాలర్లకు చేరుకుంది. ఇది దాదాపు 73.4 శాతం పెరుగుదల. ఇదే సమయంలో రూపాయి విలువ 89.96 నుండి 94.59కి పడిపోయి 5.1 శాతం క్షీణతను నమోదు చేసింది. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం మొదలైన ఒక నెల రోజుల్లోనే చమురు ధరలు 45 శాతం పైగా పెరగడం గమనార్హం. రూపాయి పతనంతో వాణిజ్యలోటు పెరగడంతో పాటుగా కార్పొరేట్ రుణాల భారం పెరగనుంది. ప్రభుత్వ విదేశీ అప్పుల కు అదనంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. మరోవైపు విదేశీ పెట్టుబడులు తరలిపోనున్నాయి.

**ఆర్థిక లోటుపై ప్రభావం**

గత ఏడాది కాలంగా రూపాయి విలువ పతనంలో రోజుకో రికార్డ్‌ను సృష్టిస్తోంది. 2025-26 బడ్జెట్‌లో ఆర్థిక లోటును 4.4 శాతంగా అంచనా వేసిన ప్రభుత్వం.. అంతర్జాతీయంగా ధరలు అదుపులో ఉంటాయని భావించింది. అయితే ప్రస్తుత పరిస్థితులు ఆ అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. గతంలో 2022 ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులే తలెత్తి భారతదేశ వాణిజ్య లోటు దాదాపు రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం ఏప్రిల్-ఫిబ్రవరి 2025-26 కాలానికి గానూ వాణిజ్య లోటు ఇప్పటికే 310.60 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఆందోళన కలిగి స్తోంది. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం వాణిజ్య లోటు అమాంతం పెరుగుతోంది.

**కేంద్రానికి సవాల్..**

బలహీనమైన రూపాయి వల్ల దిగుమతి చేసుకునే ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. ఇది రవాణా ఖర్చులను పెంచి చివరికి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణమవుతుంది. ఈ దిగుమతి ద్రవ్యోల్బణం అటు ప్రభుత్వానికి, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పెద్ద సవాలుగా మారింది. ఈ పతనాన్ని అరికట్టడానికి ఆర్‌బిఐ ఇప్పటికే రంగంలోకి దిగినప్పటికీ పెద్ద ఫలితాలు ఇస్తోన్నట్లు కనబడటం లేదు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గకపోతే భారత ఆర్థిక వ్యవస్థ రాబోయే నెలల్లో మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా బొగ్గు తవ్వకాలు..!

**టాటా స్టీల్‌కు రూ.1,755 కోట్ల డిమాండ్ నోటీసు**




రాంచీ : ప్రముఖ ఉక్కు తయారీ దిగ్గజం టాటా స్టీల్ లిమిటెడ్‌కు జార్ఖండ్ ప్రభుత్వం నుండి భారీ షాక్ తగిలింది. నిబంధనలకు విరుద్ధంగా అదనపు బొగ్గు తవ్వకాలు జరిపినట్లు పేర్కొంటూ రామ్‌గఢ్‌లోని జిల్లా మైనింగ్ కార్యాలయం ఆ కంపెనీకి రూ.1,755.10 కోట్ల డిమాండ్ నోటీసు జారీ చేసింది. ఈ మేరకు టాటా స్టీల్ శనివారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో సమాచారాన్ని వెల్లడించింది.

జార్ఖండ్‌లోని వెస్ట్ బొకారో కొల్లియరీలో 2000-01 ఆర్థిక సంవత్సరం నుండి 2006-07 మధ్య కాలంలో అనుమతించిన పరిమితి కంటే అదనంగా బొగ్గును వెలికితీసినట్లు మైనింగ్ శాఖ ఆరోపిస్తోంది. ఈ నిర్దిష్ట కాలంలో సుమారు 1,62,40,399 మెట్రిక్ టన్నుల ఖనిజ బొగ్గును నిబంధనలు అతిక్రమించి సేకరించారని నోటీసులో పేర్కొన్నారు. 2026 మార్చి 30 నాటి ఈ నోటీసు ఏప్రిల్ 3న తమకు అందినట్లు టాటా స్టీల్ తెలిపింది. మైనింగ్ శాఖ చేసిన ఈ ఆరోపణలను టాటా స్టీల్ తోసిపుచ్చింది. ఈ డిమాండ్‌కు సరైన ప్రాతిపదిక గానీ, తగిన కారణాలు గానీ లేవని కంపెనీ యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రభుత్వ నోటీసుతో తాము ఏకీభవించడం లేదని, దీనిపై తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. సంబంధిత న్యాయస్థానాల్లో ఈ నోటీసును సవాలు చేయనున్నట్లు టాటా స్టీల్ ప్రకటించింది.

## తీవ్ర సంక్షోభంలో ఎల్ఎన్‌జి టెర్మినల్స్



న్యూఢిల్లీ : భారతదేశం తన ఇంధన అవసరాల కోసం భారీ పెట్టుబడులతో నిర్మించిన లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) టెర్మినల్స్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు సరఫరా వ్యవస్థను దెబ్బతీయడంతో దేశంలోని కీలక ఎల్ఎన్‌జి టెర్మినల్స్ వాటి పూర్తి సామర్థ్యంలో సగం కూడా వినియోగంలో లేవని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకడం, రవాణా మార్గాల్లో ఆటంకాలు ఏర్పడటం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారాయి. గత కొన్నేళ్లుగా భారత్ తన గ్యాస్ అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం పెరిగింది. ప్రస్తుత సరఫరా షాక్ కారణంగా మార్చి నెలలో ఎల్ఎన్‌జి దిగుమతులు గణనీయంగా తగ్గి 1.6 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి. దేశంలోనే అతిపెద్దదైన దహేజ్ టెర్మినల్ తన సామర్థ్యాన్ని పెంచుకున్నప్పటికీ, దాని వినియోగం ప్రస్తుతం కేవలం 56 శాతానికి పడిపోయింది. అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు ప్రతి ఎంఎంబిటియు 20 డాలర్లకు పైగా పెరగడంతో దేశీయంగా ఎరువులు, విద్యుత్, ఇతర పారిశ్రామిక రంగాలు గ్యాస్ వాడకాన్ని తగ్గించుకోవాల్సి వస్తోంది. ఈ పరిణామం భారీ వ్యయంతో నిర్మించిన ఎల్ఎన్‌జి ప్రాజెక్టుల ఆర్థిక మనుగడను ప్రశ్నార్థకం చేస్తోందని ఆ పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకవైపు అంతర్జాతీయంగా ధరల అస్థిరత కొనసాగుతుండగా మరోవైపు దేశీయ గ్యాస్ ఉత్పత్తి కూడా సుమారు 5 శాతం మేర తగ్గడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధ ఘర్షణలు త్వరగా తొలగకపోతే ఇంధన భద్రత విషయంలో భారత్ మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, దీని ప్రభావం పరోక్షంగా విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలపై పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## విమాన ప్రయాణం భారం..

## ఏడాదిలో 44 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ : వేసవి సెలవుల వేళ విమాన ప్రయాణికులకు గట్టి షాక్ తగిలింది. అంతర్జాతీయ పరిణామాలు, రూపాయి పతనం, చమురు ధరల పెరుగుదలతో విమాన టికెట్ల ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నెలతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో దేశీయ విమాన ఛార్జీలు సగటున 44 శాతం మేర పెరిగాయి. ప్రముఖ ట్రావెల్ పోర్టల్ క్లియర్ ట్రిప్ డేటా ప్రకారం.. 2025 ఏప్రిల్‌లో సగటున రూ.5,850గా ఉన్న దేశీయ విమాన టికెట్ ధర.. 2026 ఏప్రిల్ నాటికి రూ.8,450కి చేరుకుంది. కేవలం దేశీయ ప్రయాణాలే కాకుండా అంతర్జాతీయ విమాన ప్రయాణాలు కూడా సామాన్యులకు భారంగా మారాయి. అంతర్జాతీయ ఛార్జీలు సుమారు 43 శాతం మేర పెరిగి సగటు టికెట్ ధర రూ.52,000 నుండి రూ. 74,500కి చేరింది. విమానయాన సంస్థలపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఛార్జీల గరిష్ట పరిమితులను తొలగించడంతో పాటు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్)పై రాయితీలను ప్రకటించింది. అయినప్పటికీ విమాన ఇంధన ధరల పెరుగుదల, కరెన్సీ ఒత్తిడి, గగనతల ఆంక్షల వల్ల ఎయిర్‌లైన్స్ సంస్థల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం ఈ రాయితీలు ఇవ్వకపోయి ఉంటే ధరలు మరిన్ని రెట్లు పెరిగే అవకాశం ఉండేదని నిపుణులు భావిస్తున్నారు. అయినప్పటికీ విమానాల సంఖ్య తగ్గడం, ఇంధన సర్‌ఛార్జీలు తోడవడంతో ప్రయాణికులకు ఉపశమనం లభించడం లేదు.

# పాదాన్ని చూసి వ్యక్తిత్వం ఏంటో చెప్పేయొచ్చు



పాదాల వేళ్ల అమరిక మనలోని సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఎదుటివారితో మనం ప్రవర్తించే తీరును తెలియజేస్తాయి. సాముద్రిక శాస్త్రం ప్రకారం మనిషి శారీరక నిర్మాణం, అవయవాల తీరు వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ముఖ కవళికలు, అరచేతి రేఖల వలె మన పాదాల ఆకృతిని బట్టి కూడా మన స్వభావం ఎలాంటిదో అంచనా వేయవచ్చని ఈ శాస్త్రం చెబుతోంది. ఈ ఆకృతిలో బొటనవేలుతో పాటు మొదటి మూడు వేళ్లు సమాన పొడవులో ఉండి, మిగిలిన రెండు వేళ్లు చిన్నవిగా ఉంటాయి. వీరు చాలా సామాజిక జీవులు, కొత్త వ్యక్తులను కలవడానికి ఇష్టపడతారు. వీరిలో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉంటాయి, తాము చేసే పనులను ఎంతో ప్రత్యేకంగా, ఎవరినీ అనుకరించకుండా పూర్తి చేస్తారు. సానుకూల దృక్పథం వీరి బలం, అయితే అప్పుడప్పుడు మొండితనం ప్రదర్శిస్తుంటారు. పాదంలోని ఐదు వేళ్లు దాదాపు ఒకే పొడవులో ఉంటే దానిని 'స్క్వేర్ ఫుట్' అంటారు. వీరు అత్యంత ఆచరణాత్మకమైన వ్యక్తులు. ఏదైనా సమస్య వస్తే ఎంతో ఓపికగా, తెలివితేటలతో పరిష్కారం వెతుకుతారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో వీరు సాటిలేని వారు. క్రమశిక్షణ, సమయ పాలన వీరి ఆభరణాలు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే వరకు విశ్రమించరు. బొటనవేలు కంటే రెండో వేలు పొడవుగా ఉంటే దానిని గ్రీక్ ఫుట్ అంటారు. దీనిని 'ఫ్లేమ్ ఫుట్' అని కూడా పిలుస్తారు. వీరు అత్యంత సృజనాత్మకత కలిగిన వ్యక్తులు. ఎప్పుడూ ఉత్సాహంగా, డైనమిక్‌గా ఉంటారు. సవాళ్లను ఎదుర్కోవడానికి ఏమాత్రం వెనుకాడరు. తమపై తమకు అపారమైన నమ్మకం ఉంటుంది, ఇతరులను కూడా ఎంతో స్ఫూర్తివంతంగా నడిపిస్తారు. రిస్క్ తీసుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. బొటనవేలు పొడవుగా ఉండి, మిగిలిన నాలుగు వేళ్లు క్రమంగా 45 డిగ్రీల కోణంలో తగ్గుతూ అమరి ఉంటే అది ఈజిప్షియన్ పాదం. వీరు స్వతంత్ర భావాలు కలిగిన వారు, తమకు నచ్చినట్లుగా బతకడానికి ఇష్టపడతారు. వీరు రహస్యాలను బాగా దాచగలరు, తమకు నచ్చిన విషయాల్లో ఎవరెన్ని చెప్పినా వెనక్కి తగ్గరు. సమస్యలకు నిర్మాణాత్మకమైన పరిష్కారాలు చూపడంలో వీరు దిట్ట. ఆశయాల సాధనలో ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. పాదాల ఆకృతిని బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం అనేది ఒక ఆసక్తికరమైన అంశం. అయితే, మనిషి వ్యక్తిత్వం అనేది కేవలం శారీరక నిర్మాణమే కాకుండా, వారు పెరిగిన వాతావరణం, అనుభవాలపై కూడా ఆధారపడి ఉంటుంది. మీ పాదాల ఆకృతిని బట్టి పై లక్షణాలు మీకు సరిపోయాయో లేదో ఒకసారి సరిచూసుకోండి!

# మనీ ప్లాంట్ విషయంలో ఈ ఒక్క తప్పు చేస్తే దరిద్రం



చాలామంది ఇళ్లలో అదృష్టం కోసం, అందం కోసం మనీ ప్లాంట్లను పెంచుకుంటారు. అయితే మీ ఇంట్లో పెరుగుతున్న ఆ మొక్కే మీ ఆర్థిక పతనానికి కారణం కావచ్చని మీకు తెలుసా? వాస్తు శాస్త్రం ప్రకారం మనీ ప్లాంట్ పెంచేటప్పుడు చేసే చిన్న చిన్న పొరపాట్లు మీ జేబును ఖాళీ చేయగలవు. ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా, సానుకూల శక్తిని ప్రసాదించే మొక్కల్లో మనీ ప్లాంట్ మొదటి వరుసలో ఉంటుంది. పేరుకు తగ్గట్టే ఇది ఇంట్లో ఉంటే సిరిసంపదలు వెల్లివిరుస్తాయని చాలామంది నమ్ముతారు. అయితే మనీ ప్లాంట్ విషయంలో చేసే కొన్ని పొరపాట్లు అదృష్టానికి బదులు తీరని ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడతాయని వాస్తు శాస్త్రం హెచ్చరిస్తోంది. మీ ఇంట్లోని మనీ ప్లాంట్ మీకు లాభాన్ని ఇస్తుందో లేక జేబును ఖాళీ చేస్తోందో ఈ నియమాలతో సరిచూసుకోండి. మనీ ప్లాంట్ ఎదుగుదల మీ పురోగతికి చిహ్నం. ఈ మొక్క తీగలు ఎప్పుడూ పైకి పాకాలి కానీ పొరపాటున కూడా నేలను తాకకూడదు. తీగలు కిందికి వేలాడటం లేదా నేలపై పడటం అంటే మీ సంపద, సానుకూల శక్తి క్రమంగా క్షీణిస్తున్నాయని అర్థం. అందువల్ల ఒక కర్ర లేదా దారం సహాయంతో తీగలను ఎల్లప్పుడూ పైదిశగా వెళ్లేలా జాగ్రత్త పడండి. వాస్తు ప్రకారం మనీ ప్లాంట్‌ను ఉంచే దిశను బట్టి దాని ఫలితం ఉంటుంది. ఆగ్నేయ మూల : ఇది మనీ ప్లాంట్‌కు అత్యంత శుభప్రదమైన దిశ. ఈ మూలకు అధిపతి గణేశుడు, గ్రహం శుక్రుడు. ఇక్కడ మొక్కను ఉంచడం వల్ల ఆటంకాలు తొలగి ఆనందం, శ్రేయస్సు పెరుగుతాయి. ఉత్తర దిశ: కొత్త ఆదాయ మార్గాలు లేదా ఉద్యోగ అవకాశాల కోసం చూస్తున్న వారు, ఉత్తర దిశలో ఒక నీలి రంగు గాజు కుండీలో మనీ ప్లాంట్‌ను ఉంచడం వల్ల కుబేరుని ఆశీస్సులు లభిస్తాయి. మొక్క ఎంత తాజాగా ఉంటే మీ ఇంటి వాతావరణం అంత సానుకూలంగా ఉంటుంది. వారానికి ఒకసారి మొక్కను తనిఖీ చేసి, పసుపు రంగులోకి మారిన లేదా వాడిపోయిన ఆకులను కత్తిరించండి. ఎండిపోయిన మొక్కలు ప్రతికూల శక్తికి మూలమని గుర్తుంచుకోండి. అలాగే, మనీ ప్లాంట్‌ను నేరుగా సూర్యరశ్మి తగిలే చోట ఉంచకండి, ఎందుకంటే ఆకులు మాడిపోవడం అశుభంగా పరిగణించబడుతుంది.

## ఇంట్లో తులసి మొక్కను ఏ రోజు నాటితే మంచిది

హిందూ సంప్రదాయంలో తులసి మొక్కను కేవలం ఒక మొక్కగా కాకుండా సాక్షాత్తూ మహాలక్ష్మి స్వరూపంగా పూజిస్తారు. వాస్తు శాస్త్రం ప్రకారం.. ఏ ఇంట్లో అయితే తులసి పచ్చగా కళకళలాడుతూ ఉంటుందో, ఆ ఇంట్లో ప్రతికూల శక్తి నశించి సానుకూలత వెల్లివిరుస్తుంది. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మొక్కను ఇంట్లో నాటడానికి, పూజించడానికి కొన్ని ప్రత్యేక నియమాలు ఉన్నాయి. ఏ రోజున నాటాలి?: తులసిని ఏ రోజు పడితే ఆ రోజు నాటడం అంత శుభప్రదం కాదు. శాస్త్రం ప్రకారం తులసిని నాటడానికి గురువారం లేదా శుక్రవారం అత్యంత శ్రేష్ఠమైనవి. గురువారం విష్ణుమూర్తికి, శుక్రవారం లక్ష్మీదేవికి అంకితం చేయబడిన రోజులు కాబట్టి, ఈ రోజుల్లో మొక్కను నాటితే ఐశ్వర్యం సిద్ధిస్తుంది. ఇక నెలల విషయానికి వస్తే కార్తీక మాసం తులసి మొక్కను నాటడానికి అత్యుత్తమ సమయం. ఈ మాసంలో తులసి పూజ చేయడం వల్ల అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయి. ఈ రోజుల్లో నాటకండి: మొక్కను నాటేటప్పుడు వారాలను గమనించడం ముఖ్యం. వాస్తు శాస్త్రం ప్రకారం.. సోమవారం, బుధవారం, శనివారం రోజుల్లో తులసిని నాటడం నిషిద్ధం. అలాగే ఆదివారాలు, ఏకాదశి రోజుల్లో కూడా మొక్కను తాకడం లేదా నాటడం చేయకూడదు. పూజా నియమాలు – జాగ్రత్తలు: తులసి కోటను ఇంట్లో ఉంచుకున్న వారు ప్రతిరోజూ కొన్ని నియమాలను పాటించాలి. ప్రతిరోజూ ఉదయం స్నానం చేసిన తర్వాతే తులసికి నీటిని సమర్పించాలి. అయితే ఆదివారాలు, ఏకాదశి రోజుల్లో మాత్రం తులసికి నీరు పోయకూడదని శాస్త్రం చెబుతోంది. దీపారాధన: ప్రతిరోజూ సాయంత్రం తులసి కోట వద్ద నెయ్యి లేదా నూనెతో దీపం వెలిగించడం వల్ల ఇంట్లోని వాస్తు దోషాలు తొలగిపోతాయి. తులసిని ఎల్లప్పుడూ ఇంటికి ఉత్తర లేదా తూర్పు దిశలో ఉంచాలి. ఇది సానుకూల శక్తిని ఆకర్షించడానికి ఉత్తమమైన స్థానం. గుర్తుంచుకోవాల్సిన విషయాలు: తులసి మొక్క ఎండిపోతే వెంటనే దాన్ని తొలగించి, నదిలో లేదా పారే నీటిలో కలపాలి. ఎండిన మొక్క ఇంట్లో ఉండటం వాస్తు దోషంగా పరిగణిస్తారు. తులసి కోట చుట్టుపక్కల ప్రాంతం ఎప్పుడూ శుభ్రంగా ఉండాలి. అక్కడ చెప్పులు విడవడం లేదా మురికి వస్తువులను ఉంచడం వంటివి చేయకూడదు. ఈ నియమాలను పాటిస్తూ తులసిని పూజించే ఇంట్లో డబ్బుకు ఎప్పుడూ కొరత ఉండదని, లక్ష్మీనారాయణుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని పండితులు చెబుతున్నారు.

# చికెన్‌లో నిమ్మరసం పిండుకుంటే..



చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై చాలామందికి అనుమానాలున్నాయి. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం.. చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం ఆరోగ్యానికి మంచిది. నిమ్మలోని ఆమ్లత్వం చికెన్‌లోని ప్రొటీన్లను విచ్ఛిన్నం చేసి మాంసాన్ని మరింత మృదువుగా చేస్తుంది. సిట్రిక్ యాసిడ్ వల్ల ప్రొటీన్లు చిన్న కణాలుగా విడిపోయి, చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి తోడ్పడుతుంది. చికెన్.. అనగానే.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ లో ప్రొటీన్ తోపాటు ఎన్నో పోషకాలు దాగున్నాయి. అయితే.. చికెన్ కాంబినేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ డైటీషియన్లు తరచూ హెచ్చరిస్తుంటారు. కోడి మాంసంతో కలిపి కొన్ని పదార్థాలను తినకూడదని.. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. అయితే.. చికెన్‌లో నిమ్మకాయ రసం పిండుకోవచ్చా లేదా అనే అనుమానం చాలామందిలో ఉంటుంది. చికెన్‌ను వండే ముందు మసాలాలు కలిపేటప్పుడు లేదా వండిన తర్వాత తినే సమయంలో నిమ్మరసాన్ని తరచుగా వాడుతుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చికెన్‌లో నిమ్మరసం పిండుకోవడం ఆరోగ్యానికి మంచిదే కాకుండా, అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల అందులోని ఆమ్లత్వం ప్రొటీన్లను విచ్ఛిన్నం చేస్తుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ కారణంగా ప్రొటీన్లు చిన్న చిన్న కణాలుగా విడిపోవడంతో, చికెన్ మరింత మృదువుగా తయారవుతుంది. ఇది ఆహారం తీసుకున్న తర్వాత చికెన్ త్వరగా జీర్ణం అవ్వడానికి గణనీయంగా ఉపయోగపడుతుంది. చికెన్ తినేటప్పుడు కొందరు జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటుంటారు. నిమ్మరసం పిండుకొని తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. కొంతమంది చికెన్‌ను స్కిన్‌తో సహా తినడానికి ఇష్టపడతారు. అలాంటి వారికి కూడా నిమ్మరసం ప్రయోజనకరంగా ఉంటుంది. చికెన్ స్కిన్ నుంచి వచ్చే కొవ్వును సమతుల్యం చేయడంలో నిమ్మరసం సహాయపడుతుంది, తద్వారా శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, చికెన్‌ను వండే ముందు మేరినేట్ చేసేటప్పుడు నిమ్మరసం కలుపుతారు. ఇది చికెన్ సరిగ్గా ఉడకడానికి దోహదపడుతుంది. నిమ్మలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఈ విటమిన్ సి, ఆహారం నుండి ఐరన్‌ను గ్రహించడానికి శరీరానికి అత్యవసరం. చికెన్‌లో లీన్ ప్రొటీన్, విటమిన్స్ బీ6, బీ12, ఐరన్ వంటి ఖనిజాలు ఉంటాయి. కాల్షియం కూడా చికెన్‌లో ఉంటుంది. వీటిని శరీరం సమర్థవంతంగా గ్రహించడానికి విటమిన్ సి అవసరం. అందువల్ల, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల పోషక విలువలు మరింత పెరుగుతాయి. మొత్తంగా చూస్తే, చికెన్‌లో నిమ్మరసం కలుపుకోవడం వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండవని, బదులుగా మాంసం మృదువుగా మారడం, జీర్ణక్రియ మెరుగుపడటం, కొలెస్ట్రాల్ నియంత్రణ, పోషకాల శోషణ పెరగడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.


# సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం?



ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే ఆ రోజు పూర్తి చేయాల్సిన పనుల గురించి మన మెదడు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంటుంది. లక్ష్యం చిన్నదైనా పెద్దదైనా ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత విజయం లభించే వరకు అదే ఉత్సాహాన్ని, పట్టుదలను కొనసాగించడం చాలా ముఖ్యం. అప్పుడే మనం అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. జీవితంలో అడ్డంకులు ఎదురవ్వడం సహజం, మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు పరిస్థితులు తారుమారు కావచ్చు. అటువంటి సమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో పోరాడి చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా ముందుకు సాగాలి. ఓటమి అంచుల్లో ఉన్నప్పుడు కూడా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతం అవుతుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం కలలు కనడం సరిపోదు, వాటిని నిజం చేసుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించక అలసట కలగవచ్చు, కానీ ఆ సమయంలోనే మనలోని అంతర్గత శక్తిని బయటకు తీయాలి. గోమతి అనే మహిళ జీవితంలో జరిగిన సంఘటన దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.

ఆమె 1979లో మదురై కామరాజ్ యూనివర్సిటీలో డిగ్రీలో చేరారు. ఉత్సాహంగా చదువు మొదలుపెట్టిన కొద్ది రోజులకే అనారోగ్య సమస్యల వల్ల చదువు ఆపేయాల్సి వచ్చింది. ఒక ఏడాది వృథా అయిందని బాధపడుతున్న సమయంలో, యూనివర్సిటీ నుండి పొరపాటున వచ్చిన ఒక పరీక్షా దరఖాస్తు ఆమె జీవితాన్ని మార్చేసింది. ఆ అవకాశాన్ని వదులుకోకుండా భర్త అనుమతితో కేవలం మూడు నెలల కఠోర శ్రమతో పరీక్షలు రాసి విజయం సాధించారు. ఫలితంగా ఆమె అనుకున్నట్లుగానే పట్టభద్రురాలిగా గుర్తింపు పొందారు. మనకు ఎటువంటి ప్రతిభ లేదని చాలామంది ఫిర్యాదు చేస్తుంటారు, కానీ ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దానిని గుర్తించి అంకితభావంతో కృషి చేస్తే లక్ష్యం మన చెంతకు చేరుతుంది. ఏదైనా పనిని ప్రారంభంలో కష్టంగా అనిపించినా ఇష్టంతో చేయడం మొదలుపెడితే అందులో వేగంగా పురోగతి సాధించవచ్చు. లక్ష్య సాధనలో సమయం చాలా విలువైనది, అన్ని పనులను మనమే చేయాలని అనుకోకుండా బాధ్యతలను పంచుకోవడం వల్ల సమయం ఆదా అవుతుంది. జీవిత ప్రయాణంలో మనం తప్పుడు మార్గంలో వెళ్తున్నామని తెలిసిన వెంటనే సరిదిద్దుకోవాలి. తప్పుడు బస్సు ఎక్కామని తెలిసినప్పుడు తదుపరి స్టాప్‌లోనే దిగిపోవడం తెలివైన పని, లేదంటే మరింత సమయం వృథా అవుతుంది. అలాగే శారీరక దృఢత్వం కోరుకునే వారు బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి నడకను అలవాటు చేసుకోవాలి. అది ఇంటిని శుభ్రం చేయడం వంటి చిన్న పని అయినా, ఇల్లు కట్టడం వంటి పెద్ద పని అయినా ఏకాగ్రతతో చేస్తే విజయం లభిస్తుంది. మీ లక్ష్యంపై దృష్టి సారించి ప్రపంచాన్ని జయించండి. నిరంతర కృషి, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే మిమ్మల్ని ఉన్నత స్థానంలో నిలబెడతాయి. మీ ప్రతిభను నమ్మి ఇష్టంతో పని చేయండి, విజయం మీ ముంగిట ఉంటుంది.

# జీన్స్‌ను ఎన్ని రోజులకోసారి ఉతకాలి



జీన్స్ ఒక స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం. పురుషులు, మహిళలూ.. చిన్నా పెద్దా అంతా జీన్స్ ను ఇష్టంగా ధరిస్తారు.. అయితే, వాటిని ఎప్పుడు ఉతకాలో చాలా మందికి గందరగోళంగా ఉంటుంది. జీన్స్.. జీన్స్.. జీన్స్.. చిన్నా పెద్దా అందరూ ఇష్టపడే.. స్టైలిష్, సౌకర్యవంతమైన వస్త్రం.. ఈ రోజుల్లో జీన్స్ కేవలం ఒక దుస్తువు మాత్రమే కాకుండా.. అవి ప్రతి ఒక్కరి దైనందిన జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారాయి. కాలేజీ అయినా, ఆఫీసు అయినా, లేదా సాధారణంగా బయటకు వెళ్లినా, సరిగ్గా సరిపోయే ఒక జీన్స్ ప్యాంటు ప్రతి సందర్భంలోనూ స్టైల్, సౌకర్యం రెండింటినీ అందిస్తుంది. కానీ వాటిని తరచుగా లేదా తప్పుగా ఉతకడం అందరూ చేసే సాధారణ పొరపాటు.. ఇలా చేయడం వల్ల జీన్స్ దుస్తులు ముందుగానే చినిగిపోతాయి.. లేదా రంగు మారి పాలిపోయి కనిపిస్తుంది. చాలా మంది జీన్స్ వేసుకున్న ప్రతిసారీ ఉతకాలని అనుకుంటారు.. మరికొందరు వారాలు లేదా నెలల తరబడి వాటిని ఉతకకుండా ఉంటారు. నిజం ఏమిటంటే, జీన్స్ మన్నిక, ఫిట్, రంగును కాపాడుకోవడానికి వాటిని సరైన పద్ధతిలో జాగ్రత్తగా చూసుకోవడం, సరైన సమయంలో ఉతకడం చాలా కీలకం.. జీన్స్ ఇతర దుస్తుల కంటే చాలా దృఢంగా ఉంటాయి.. కానీ అంతమాత్రాన వాటిని ఎలా పడితే అలా ఉతకకూడదు. పదేపదే ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడం, బట్ట వదులుగా మారడం, సరిగ్గా సరిపోకపోవడం జరగవచ్చు. నిజానికి, జీన్స్‌ను ఎప్పుడు ఉతకాలి అనేది.. మీరు వాటిని ఎంత తరచుగా ధరిస్తారు, వాతావరణం, మీరు వాటిని ఎంతగా వాడుతున్నారు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది ఫ్యాషన్ నిపుణులకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ, బ్రిటిష్ ఫ్యాషన్ డిజైనర్, వ్యాపారవేత్త టామ్ ఫ్రాన్స్ ఒక ఇంటర్వ్యూలో తాను తన జీన్స్‌ను 20 సార్లు ధరించిన తర్వాత ఉతుకుతానని పేర్కొన్నారు. సాధారణంగా, జీన్స్‌ను 10 నుండి 12 సార్లు ధరించిన తర్వాత ఉతకాలి. అయితే, మేము ఇప్పటికే చెప్పినట్లుగా, మీరు జీన్స్ ధరించే కాలం కూడా ముఖ్యమైనదే. మీరు చాలా వేడిగా లేదా చెమట ఎక్కువగాద

ఉండే ప్రాంతంలో ఉన్నట్లయితే, వాటిని 2 నుండి 3 సార్లు ధరించిన తర్వాత ఉతకడం ఉత్తమం. శీతాకాలంలో, మీరు జీన్స్‌ను 7 నుండి 8 సార్లు ధరించిన తర్వాత ఉతకవచ్చు. తరచుగా ఉతకడం వల్ల రంగు వెలిసిపోవడానికి, బట్ట వదులుగా మారడానికి కారణమవుతుందని గుర్తుంచుకోండి.. కాబట్టి అవసరమైనప్పుడు మాత్రమే వాటిని ఉతకడం ఉత్తమం.

# CSK ఫ్యాన్స్‌కి కిర్రాక్ న్యూస్.. ధోనీ, బ్రెవిస్ రీఎంట్రీకి డేట్ ఫిక్స్.. వచ్చేది ఆ రోజే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆరంభంలోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన జట్టు వరుసగా 3 మ్యాచ్‌ల్లో ఘోర ఓటమిని చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్స్ తో జరిగిన హైవోల్టేజ్ పోరులో చెన్నై ఘోరంగా ఓడిపోయింది. మైదానంలో మహేంద్ర సింగ్ ధోనీ మార్గనిర్దేశం లేకపోవడం, వికెట్ల వెనుక అతడి చాకచక్యం లోపించడంతో జట్టు ప్రదర్శనపై తీవ్రంగా కనిపిస్తుంది. పిక్క కండరాల గాయంతో మొదటి రెండు వారాలు ధోనీ అందుబాటులో ఉండరని సీఎస్కే ఫ్రాంచైజీ ప్రకటించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అతడి రాకను త్వరలోనే ఫిక్స్ చేసే అవకాశం ఉంది.

**తలా రీఎంట్రీ:**

నిజానికి మహేంద్ర సింగ్ ధోనీ ఐదో మ్యాచ్‌లో కోల్‌కతాపై పునరాగమనం చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ జట్టు వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉండటంతో, చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏప్రిల్ 11వ తేదీన చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లోనే ఎంఎస్ ధోనీ బరిలోకి దిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా ఫిట్‌నెస్ పరీక్షను నిర్వహించబోతున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ పరీక్షలో ధోనీ నెగ్గితే, సొంత మైదానంలో అభిమానుల కేరింతల మధ్య మహేంద్రుడు మెరుపులు మెరిపించడం ఖాయంగా మారనుంది.

**ఫినిషర్‌గా ధోనీ:**

వయసు మీద పడుతున్నప్పటికీ, ఎంఎస్ ధోనీ ఫినిషింగ్ సామర్థ్యం ఏమాత్రం తగ్గలేదు.. వికెట్ కీపింగ్‌లో మెరుపు వేగంతో స్పందించడమే కాకుండా, క్లిష్ట సమయాల్లో బౌలర్లకు సరైన సలహాలు ఇవ్వడంలో అతడు కీలక పాత్ర పోషిస్తాడు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ధోనీ అనుభవం చెన్నై జట్టుకు ఎంతో అవసరం అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల ఖాతా తెరవాలని సీఎస్కే పట్టుదలతో ఉంది. ఈ కీలక పోరులో ధోనీతో పాటు మరో ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ సైతం తుది జట్టులోకి ఎంట్రీ ఇస్తాడని.. వీరిద్దరి రాకతో జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు.


# ఇకపై ఆ పప్పులు ఉడకవు.. చిన్నస్వామిలో సీన్ మారింది: బెంగళూర్ పిచ్ సీక్రెట్ బయటపెట్టిన పడిక్కల్



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూర్‌లోని చినస్వామి స్టేడియం.. గ్రౌండ్ చిన్నగా ఉంటుంది.. ఈ స్టేడియంలో జరిగే మ్యాచుల్లో దాదాపు భారీ స్కోర్లే నమోదు అవుతుంటాయి. బ్యాటర్ల బౌండ్రీల సునామీతో అభిమానులకు కూడా కావాల్సినంత మజా దొరుకుతుంది. కానీ ఇకపై ఆ పప్పులు ఉడకవు.. వచ్చి రాగానే సిక్సులు కొడతామంటే కుదరదు.. చిన్నస్వామిలో సీన్ మారింది అంటున్నాడు ఆర్సీబీ బ్యాటర్, కర్నాటక లోయల్ బాయ్ దేవదత్ పడిక్కల్. ఆదివారం (ఏప్రిల్ 5) చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ తలపడ్డ విషయం తెలిసిందే. ఈ మ్యాచులో అతిథ్య బెంగళూర్ 43 పరుగుల తేడాతో చెన్నైను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం ఆర్సీబీ బ్యాటర్ పడిక్కల్ మాట్లాడుతూ చిన్నస్వామి పిచ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్నస్వామి పిచ్‌లో బ్యాటింగ్ తీరు మారిందని.. గతంలో మాదిరిగా తొలి బంతి నుంచే భారీ స్కోరు చేయడం ఇకపై సాధ్యం పేర్కొన్నాడు. తొలి ఓవర్లలో పిచ్ కొంచెం జిగటగా ఉంటుందని.. దీంతో మొదటి నుంచి దూకుడుగా ఆడటం ఇబ్బందికరమన్నాడు. తొలుత వికెట్లు కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని.. బంతి పాతబడే కొద్ది బ్యాటింగ్ ఈజీ అవుతుందని చెప్పాడు. 2025లో మా హోం గ్రౌండ్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత మేం ఈ విషయాన్ని గుర్తించామని తెలిపాడు. ఆ ఎదురుదెబ్బల నుంచి గుణపాఠం నేర్చుకుని.. తొలి 10 ఓవర్లలో అతిగా దూకుడుగా వెళ్లకుండా ఆడాలని నిర్ణయించుకున్నామని టీమ్ ప్లానింగ్ వివరించాడు.

చెన్నై, ఆర్సీబీ మ్యాచ్ అచ్చం పడిక్కల్ చెప్పిన మాదిరిగానే జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ పవర్ ప్లేలో అనుకున్నంతా దూకుడుగా ఆడకలేకపోయింది. విధ్వంసకర ప్లేయర్ సాల్ట్, కోహ్లీ వేగంగా రన్స్ చేయడంలో ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లేలో ఆర్సీబీ కేవలం 51 పరుగులు మాత్రమే చేయగలిగింది. కానీ ఆర్సీబీ 10 ఓవర్ల వరకు వికెట్లను కాపాడుకుంది. ఆ తర్వాత నుంచి గేర్ మార్చి ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చివరి ఐదు ఓవర్లలోనే ఆర్సీబీ 97 పరుగులు చేసిందంటే ఆ జట్టు ఏ విధంగా విధ్వంసం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇక, కొండంత లక్ష్యం కండ్ల ముందు ఉండటంతో పిచ్ పరిస్థితి గురించి పట్టించుకోకుండా చెన్నై బ్యాటర్లు తొలి బంతి నుంచే బాదుడు మొదలు పెట్టారు. దీంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు నాలుగు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురై చివరకు మ్యాచ్ ఓటమి పాలైంది.

# స్నాప్‌చాట్ పోస్ట్.. అమ్మాయితో అడ్డంగా దొరికేసిన అర్ష్‌దీప్ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా అతడి స్నాప్‌చాట్‌లో షేర్ చేసిన కొన్ని ఫోటోలు డేటింగ్ రూమర్లకు దారి తీశాయ. ఒక మిస్టరీ గర్ల్ చేయి పట్టుకుని ఉన్న ఫోటోను షేర్ చేయడంతో, ఆ అమ్మాయి ఎవరనే దానిపై అభిమానుల్లో ఇంట్రెస్ట్ మొదలైంది. ఇక ఆ అమ్మాయి పంజాబీ నటి సవ్రీన్ కౌర్ అని నెటిజన్లు భావిస్తున్నారు. ఫోటోలో కనిపిస్తున్న అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, సవ్రీన్ కౌర్ టాటూతో సరిపోలడమే ఇందుకు ప్రధాన కారణం.. అంతేకాదు, ఇటీవల ముంబైలోని వాంఖడే స్టేడియంలో, న్యూ చండీగఢ్‌లో జరిగిన పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు ఆమె హాజరుకావడం ఈ అనుమానాలను మరింత బలపరిచింది.

సవ్రీన్ కౌర్ పంజాబీ చిత్ర పరిశ్రమలో పలు పంజాబీ మ్యూజిక్ వీడియోలు, సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా, కపిల్ దేవ్ నాయకత్వంలోని 1983 వరల్డ్ కప్ విజయం ఆధారంగా తెరకెక్కిన '83' సినిమాలో కూడా ఆమె ఒక పాత్రలో నటించారు.

**మైదానంలో అర్ష్‌దీప్:**

ఈసారి జరుగుతున్న ఐపీఎల్ లో అర్ష్‌దీప్ సింగ్‌కు అంతగా కలిసిరాలేదు. ఈ సీజన్‌లో అతడు ఇప్పటి వరకు ఒక్క వికెట్ కూడా తీయలేదు. లైన్ అండ్ లెంగ్త్ విషయంలో కాస్త ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ 27 ఏళ్ల ఈ లెఫ్ట్ హ్యాండ్ పేసర్ త్వరలోనే ఫామ్‌లోకి వచ్చి పంజాబ్ కింగ్స్ జట్టుకి తొలి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాడని టీమ్ మేనేజ్‌మెంట్, అభిమానులు ఆశిస్తున్నారు. అటు వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణం, ఇటు మైదానంలో సవాళ్లతో అర్ష్‌దీప్ ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్నారు.

# యాంగ్రీ స్టార్ ఫ్యామిలీ స్టార్ లా బిజీ అవుతారా?

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ప్రస్తానం గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాల పాటు హీరోగా ఎన్నో చిత్రాలతో మెప్పించారు. తెలుగులో తనకంటూ ప్రత్యేకమైన అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఇలా కొంత కాలం పాటు ఆయన జమానా నడించింది. హీరోగా అవకాశాలు తగ్గిన క్రమంలో? సొంత బ్యానర్లో కూడా చాలా సినిమాలు నిర్మించారు. వాటిలో కొన్ని విజయాలతో పాటు వైఫల్యాలున్నాయి. ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. నితిన్ హీరోగా నటించిన -ఎక్స్‌ట్రా ఆర్డీనరీ మ్యాన్- తో సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినా? ఆ సినిమా వైఫల్యంతో రీచ్ అవ్వలేదు.తాజాగా రిలీజ్ అయిన -బైకర్- విజయం సాధించడంతో రాజశేఖర్ రోల్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. దీంతో అధికారికంగా రాజశేఖర్ సెకెండ్ ఇన్నింగ్స్ షురూ అయింది. నటనలో ఆయన చూపిన పరిణతి, గంభీరమైన ఆహార్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.రాజ శేఖర్‌కు ఉన్న ప్రత్యేకమైన వాయిస్ బేస్ , స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద హీరోల సినిమాల్లో పవర్‌ఫుల్ పాత్రలకు సరిగ్గా సరిపోతాయి. ముఖ్యంగా మాస్ సినిమాల్లో తండ్రి పాత్రలు, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్స్ లేదా ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో ఆయన కనిపిస్తే ఆ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది.ఒకప్పుడు అగ్ర హీరోగా వెలిగిన నటులు ఇలాంటి మార్పును అంగీకరించడం అంత సులభం కాదు. కానీ రాజశేఖర్ వాస్తవాన్ని గ్రహించి నటుడిగా తన ప్రయాణాన్ని కొనసాగించడానికి సిద్ధపడటం శుభపరిణామం. ఇది కేవలం ఆయనకు మాత్రమే కాకుండా, టాలీవుడ్ పరిశ్రమకు కూడా ఒక మంచి సీనియర్ నటుడు అందుబాటులోకి వచ్చిన ట్లవుతుంది. వైవిధ్యమైన పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత కలర్‌ఫుల్‌గా మార్చుకునే అవకాశం ఆయన చేతుల్లోనే ఉంది. టాలీవుడ్‌లో హీరోగా ఇమేజ్ తగ్గిన తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. -లెజెండ్- సినిమాతో విలన్‌గా మారి సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా బిజీ అయ్యారు.రాజశేఖర్ క్లిక్ అయితే జగపతి బాబుకు పోటీగానూ మారే అవకాశం ఉంది. జగపతి బాబు తరహాలోనే పరిశ్రమలో బలమైన వర్సటైల్ నటుడిగా స్థిరపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి యాంగ్రీ స్టార్ నుండి వర్సటైల్ స్టార్ గా ఆయన ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. రాజశేఖర్ కూడా ఇంత కాలం పెదవి దాటని మాటని ఈ మధ్యనే దాటించారు. మంచి పాత్రలు పోషించడానికి తానెప్పుడు ముందుటానని వెల్లడించిన నేపథ్యంలో కొత్త అవకాశాలు ఎంత మంది కల్పిస్తారో చూడాలి. ఇప్పటికే రెండు..మూడు ప్రాజెక్ట్‌లు ఉన్నట్లు యాంగ్రీస్టార్ రివీల్ చేసిన సంగతి తెలిసిందే.





సోనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965